www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:54, గురువారం, 14.12.2023



## నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- ఈ నెల17 వరకు జరిగే అవకాశం.. కౌన్సిల్‌కోసం కొత్త భవనం నిర్మాణం

..మిగతా 2 లో



# పార్లమెంటులో పొగ వదిలారు

- సమావేశం జరుగుతుండగానే దారుణం
- ఐదుగురి అరెస్ట్ ... దేశవ్యాప్తంగా విస్మయం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్న వేళ బుధవారం లోక్‌సభ లోకి దుండగులు దుసుకొచ్చారు. టియర్ గ్యాస్ వదలడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనలో నలుగురి పాత్ర ఉన్నట్టు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. ఇందులో ఆరుగురి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు మరో నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. దుండగులు పక్కా ప్రణాళిక, పరస్పర సమన్వయంతోనే ఈ తరహా దుశ్చర్యకు పాల్పడ్డారని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. నిందితులందరికీ నాలుగేళ్లుగా పరిచయం ఉందని, కొద్ది రోజుల క్రితమే రెక్కీ కూడా నిర్వహించారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
లోక్‌సభ గ్యాలరీలోకి ప్రవేశించి ఎంపీలను భయాందోళనకు గురిచేసిన సాగర్ శర్మ, మనో రంజన్ డి అనే వ్యక్తులను అక్కడే అదుపులోకి తీసుకోగా.. అమోల్ శిందే, నీలమ్‌ను పార్లమెంటు భవనం వెలుపల అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిని పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. అయితే, వీరితో పాటు లలిత్, విక్రమ్ అనే మరో ఇద్దరి పేర్లు బయటకు వచ్చాయి. దీంతో విక్రమ్‌ను గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకోగా.. లలిత్ కోసం ఢిల్లీ పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

**లోక్‌సభలో భద్రతా వైఫల్యం.. దర్యాప్తు బాధ్యత నాదే: స్పీకర్ హామీ**

**ఆరుగురు వెళ్లాలనుకున్నా.. ఇద్దరికే విజిటర్ పాస్‌లు**

పార్లమెంటుకు వచ్చే ముందు ఈ ఐదుగురూ గురుగ్రామ్‌లోని విక్రమ్ ఇంట్లోనే ఉన్నట్లు పోలీసు విచారణలో తేలినట్లు సమాచారం. ప్రణాళిక ప్రకారం ఆరుగురూ పార్లమెంటు లోపలికి వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. ఇద్దరికే విజిటర్ పాసులు దొరికాయి. నాలుగేళ్లుగా ఒకరితో ఇంకొకరికి పరిచయం ఉందని.. సామాజిక మాధ్యమాల వేదికగా కాంటాక్టు అయ్యేవారని పోలీసులు గుర్తించారు. అమోల్ శిందేను విచారించగా ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ తరహా దాడికి ప్రయత్నించాలని ఎవరైనా వ్యక్తులు లేదా సంస్థ ఆదేశించిందా అనే విషయాన్ని తెలుసుకొనేందుకు ఢిల్లీ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మైసూర్ ఎంపీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నిరసన మరోవైపు, నిందితులు లోక్‌సభలోకి వెళ్లేందుకు అవసరమైన పాసులు మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహ్ కార్యాలయం నుంచి జారీ కావడంతో ఆయన కార్యాలయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. దీంతో ఎలాంటి

..మిగతా 2 లో



# అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్..

- ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుతో ఏకగ్రీవ ఎన్నిక..
- ఎంపిక కు హాజరైన అన్ని పార్టీల నాయకులు
- తెలంగాణ రాష్ట్ర తొలి దళిత స్పీకర్‌గా 'గడ్డం'

తెలంగాణ సభాపతిగా గడ్డం ప్రసాద్ కుమార్ ఎంపిక ఏకగ్రీవమైంది. స్పీకర్‌గా ఆయన పేరును కాంగ్రెస్ ప్రతిపాదించగా ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. గడువు ముగిసే సమయానికి ఒకే నామినేషన్ దాఖలవడంతో స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఎన్నిక ఖాయమైంది. రేపు అధికారికంగా ప్రకటించనున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు.. గడ్డం ప్రసాద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్లారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. నామినేషన్ పత్రాలపై బీఆర్ఎస్ తరపున కేటీఆర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య సంతకం చేశారు. నామినేషన్ కాపీని అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కేటీఆర్, కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
కాగా, స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవానికి సహకరించాలని ఇప్పటికే రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బీఆర్ఎస్ పార్టీ అధినేత , పార్టీ శాసన సభానేత కేసీఆర్‌ను కోరడం, వారు సమ్మతించటం మరోవైపు ఎంఐఎం నేత పార్టీ సైతం మద్దతు ఇస్తున్న నేపథ్యంలో స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. అనంతరం, అన్ని పక్షాల నేతలు.. గడ్డం ప్రసాద్‌ను స్పీకర్ స్థానంలో కూర్చోబెడతారు. శుక్రవారం ఉభయ సభలను ఉద్దేశించి.. గవర్నర్ ప్రసంగం ఉంటుంది. ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ఉంటుంది. గడ్డం ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఎన్నికను గురువారం ఉదయం సభలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రకటించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గడ్డం ప్రసాద్‌కుమార్ రెండుసార్లు వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా నెగ్గారు. తొలిసారి ఆయన నెగ్గింది 2008 ఉప ఎన్నికల్లో. ఆ తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగానూ పని చేశారు. అయితే ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఓడారు. ఆపై కాంగ్రెస్‌కు ఉపాధ్యక్షుడిగా, టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగానూ పని చేశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నుంచే మళ్లీ ఎమ్మెల్యేగా నెగ్గారు. సహజంగానే అధికార పార్టీ స్పీకర్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా నియమిస్తే తెలంగాణ రాష్ట్ర తొలి దళిత స్పీకర్ అవుతారు. గడ్డం ప్రసాద్ కుమార్ స్వస్థలం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం బెల్కటూరు గ్రామం. తల్లిదండ్రులు ఎల్లమ్మ, ఎల్లయ్య. తాండూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1984లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు.





# స్మితా సబర్వాల్ ను కేంద్రానికి పంపొద్దు

- హెలీక్యాప్టర్ లో తిరిగిన ఐఏఎస్ ఆమె ఒక్కరే
- ఇక్కడ తప్పులు చేసి కేంద్రానికి వెళ్లాలని ప్లాన్
- ఆకునూరి మురళి సంచలన ట్వీట్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వ్యవహారం వివాదాస్పదం అవుతోంది. గత ప్రభుత్వంలో సీఎంవో కార్యదర్శిగా పని చేసిన ఆమె.. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారితో దూరంగా ఉంటున్నారు. కనీసం ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని కూడా ఆమె మర్యాదపూర్వకంగా కలవలేదని విమర్శలు ఉన్నాయి. ఆమె కేంద్ర సర్వీసుల్లోకి డిప్యుటేషన్ పై వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె గురించి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి స్పందించడం చర్చనీయాంశం అయింది. ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్ ను కేంద్ర సర్వీసుల్లోకి పంపొద్దని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో చేసినవన్నీ చేసి కొత్త ప్రభుత్వం రాగానే కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లోకి వెళ్లి, ఇక్కడి తప్పుల నుంచి తప్పించుకోవడం కొంత మంది ఐఏఎస్‌లకు ఫ్యాషన్ అయిపోయిందని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వీళ్ళను కేంద్రానికి పంపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏం తప్పులు చెయ్యకపోతే ఎందుకు భుజాలు తడుముకోడం అని విమర్శించారు. దేశంలో హెలికాప్టర్ లో వెళ్లి పనులను పర్యవేక్షించే ఏకైక ఐఏఎస్

..మిగతా 2 లో

## అన్నా.. జర సహకరించండి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ ఫోన్
- కేంద్ర నిధులు ఇప్పించాలని కోరిన ముఖ్యమంత్రి
- ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్ర సర్కారు

..మిగతా 2 లో

# అదే ఆయన బాధ..!

## కేటీఆర్ పై మంత్రి సీతక్క సెటైర్లు




**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**
తమ చేతిలో నుంచి పవర్ పోయిందని మాజీ మంత్రి కేటీఆర్ బాధపడుతున్నాడని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం సీఎల్పీలో మీడియాతో మాట్లాడుతూ.. తాము పవర్‌లోకి వచ్చి వారం రోజులు పూర్తి కాకముందే కేటీఆర్ విమర్శలు చేయడం తగదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామన్నారు. కేటీఆర్, బీఆర్ ఎస్‌కు ఎలాంటి టెన్షన్ అవసరం లేదన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను పూర్తి చేస్తామన్నారు.ప్రతిపక్షాలు ఓపిక పట్టాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకి ప్లాన్, చిత్తశుద్ధి ఉన్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీ రెండు దఫాల అధికారంలో అనేక తప్పిదాలు చేసిందని, ప్రతి అంశంపై విచారణ జరుగుతుందన్నారు. లెక్కలన్నీ బయటకు తీస్తామన్నారు. ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రజా సంక్షేమం కోసం మాత్రమే వినియోగిస్తామన్నారు. ఇక రైతు బంధుపై సమయం లేకపోవడంతో పాత పద్ధతినే అమలు చేస్తున్నామన్నారు. త్వరలో కొత్త విధానాన్ని తీసుకువస్తామన్నారు.

# కాంగ్రెస్ వి సాధ్యం కానీ హామీలు

- ఇప్పుడుంది అసలు ఆట
- గవర్నర్ ప్రసంగంలో అదే పాత చింతకాయ పచ్చడి చెప్తారు
- రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి తమకు ఇచ్చారని అంటారు
- చిట్‌చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్



**విశాలభారతి,హైదరాబాద్ :**
సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏనాడూ పద్దులపై చర్చ జరగలేదన్నారు. కాంగ్రెస్ పాలకులకు అసలు ఆట ఇప్పుడు ఉందని, శాసనసభ ఆవరణలో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దుయ్యబట్టారు. గురువారం జరగబోయే గవర్నర్ ప్రసంగంలో ఇదే పాత చింతకాయ పచ్చడి చెప్తారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి తమకు ఇచ్చారని చెప్తారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఆవరణలోని

..మిగతా 2 లో

# ధరణి' లెక్క తేల్చండి

- 10 రోజుల్లో నివేదిక ఇవ్వాలి.. ఈ యాప్ భద్రమేనా?
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష



**విశాలభారతి,స్టేట్ బ్యూరో**
భూముల రిజిస్ట్రేషన్ కు సంబంధించిన ధరణి పోర్టల్ పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష ముగిసింది. ధరణిపై లక్షల సంఖ్యలో కంప్లైంట్స్ ఉన్నాయని తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. సమస్యల పరిష్కారానికి మండల స్థాయి గ్రీవిన్స్ సెల్ ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు పూర్తి స్థాయిలో సేకరించి నివేదికలో పొందుపరచాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
ధరణి పోర్టల్ లోటు పాట్ల పై వారం, 10 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీసీఎల్ కమిషనర్ నవీన్ మిట్టల్ ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ధరణిపై పూర్తి అవగాహన కోసం, సమస్యల పరిష్కారానికి పరిష్కారం దిశగా అడుగులు వేసేందుకు మరోసారి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలని రేవంత్ భావిస్తున్నారు. ధరణి యాప్ భద్రతపై సైతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి ద్వారా లావాదేవీలపై వస్తున్న విమర్శలకు డాటా రూపంలో వివరణ ఇవ్వాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
అధికారంలోకి రాగానే భూముల సమస్యలు పరిష్కరించేందుకు ధరణిపై పూర్తి స్థాయిలో నివేదిక తీసుకుని భారీ మార్పులు తీసుకొస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు చెప్పారు. తాజాగా ధరణిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష జరిపి కొన్ని కీలక విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే భూమి సమస్యలు ఎందుకొచ్చాయి, రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా ఫిర్యాదులు ఎందుకొచ్చాయని అధికారులను ప్రశ్నించారు. సాధ్యమైనంత త్వరగా ధరణిపై నివేదిక అందివ్వాలని ఆదేశించారు. త్వరలోనే ధరణి అంశంపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పరిష్కారం కోసం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# పార్లమెంటులో పొగ వదిలారు

**మొదటిపేజీ తరువాయి**

అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. జలదర్శిని అతిథి గృహంలోని మైసూరు ఎంపీ కార్యాలయం వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. లోక్‌సభలో జరిగిన భద్రతా వైఫల్యానికి ఆయనే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# స్మితా సబర్వాల్ ను కేంద్రానికి పంపొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఆఫీసర్ కూడా ఈమెగారే అంటూ ఆకునూరి మురళి స్మితా సబర్వాల్‌పై ఆరోపణలు చేశారు.

"అప్పటి ప్రభుత్వం లో చేసినవన్నీ చేసి కొత్త ప్రభుత్వం రాగానే కేంద్ర ప్రభుత్వం కు వెళ్లి (అక్కడి caste కనెక్షన్స్ network వాడుకొని ) ఇక్కడి తప్పులను తప్పించుకోడం fashion అయ్యింది కొంత మంది IAS ఆఫీసర్లకు. తెలంగాణ ప్రభుత్వం వీళ్ళను కేంద్రం కు పంపకుండా చర్యలు తీసుకోవాలి. ఏం తప్పులు చెయ్యకపోతే ఎందుకు భుజాలు తడుముకోడం.. దేశం మొత్తం లో హెలికాప్టర్ లో వెళ్లి పనులను inspection చేసే ఏకైక IAS ఆఫీసర్ ఈమె మాత్రమే" అని ఆకునూరి మురళి ట్వీట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేస్తూ ఆకునూరి మురళి ట్వీట్ చేశారు.కేసీఆర్ ప్రభుత్వంలో స్మిత సబర్వాల్ కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆమె కాళేశ్వరం పనులతోపాటు మిషన్ భగీరథ పనులను కూడా పర్యవేక్షించారు. సీఎంవో కార్యదర్శిగా పని చేశారు. కానీ, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఆయన్ను ఇప్పటి వరకు మర్యాదపూర్వకంగా కూడా కలవలేదు. దీంతో స్మితా సబర్వాల్ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లాలని యోచిస్తున్నట్లు.. కేంద్రానికి దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో 23 ఏళ్ల సర్వీసు చేశానని ఆమె గుర్తు చేసుకుంటూ ఆమె ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. ఏదైనా సరే కొత్త ఛాలెంజ్‌లకు తాను ఎప్పుడూ సిద్ధం అంటూ స్మిత సబర్వాల్ ట్వీట్ చేశారు.2001లో ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరిన స్మితా సబర్వాల్.. మెదక్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. ప్రజలకు ఎన్నో మంచి పనులు చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. పని తీరు విషయంలో ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. తద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు.

# కాంగ్రెస్ వి సాధ్యం కానీ హామీలు

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. తొలి కేబినేట్ భేటీలోనే ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న మాట ఏమైందని, హామీలిచ్చినప్పుడు ఆ సంగతి తెలియదా అని ప్రశ్నించారు. తాము ఏటా పద్దులపై శ్వేతపత్రం విడుదల చేశామని కేటీఆర్ తెలిపారు. ప్రతి ఏడాది కాగ్ నివేదికలు ఇస్తున్నారని, ఆడిట్ లెక్కలు తీస్తున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి తమకు అప్పగించారని ఇక కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ఓ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో 45వేల ఉద్యోగాలిస్తామన్నారు. అన్ని ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే స్పష్టత ఇవ్వట్లేదని ఆక్షేపించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చాలా ఉన్నాయి. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆ బరువు వాళ్లకు తెలియాలి. కాంగ్రెస్ పాలకులకు ఇప్పుడుంది అసలు ఆట అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# అన్నా .. జర సహకరించండి

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ ఫోన్**
- **కేంద్ర నిధులు ఇప్పించాలని కోరిన ముఖ్యమంత్రి**
- **ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్ర సర్కారు**

**విశాలభారతి,హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధుల సమీకరణపై దృష్టి పెట్టారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను విడుదల చేయించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి.. రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ఇతర అంశాలపై పరస్పర సహకారం ఉండాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ విషయం చొరవ చూపాలని కిషన్ రెడ్డిని రేవంత్ రెడ్డి కోరారు. తమ వైపు నుంచి సహకారం ఉంటుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

**తెలంగాణ నుంచి ఏకైక కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి**

తెలంగాణ బీజేపీ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ కిషన్ రెడ్డి ఇంకా కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారు. అదే సమయంలో ఏ రాష్ట్రంలో అయినా కొత్తగా ఎవరైనా ముఖ్యమంత్రి పదవి చేపడితే.. ప్రదానమంత్రితో సమావేశమవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి కూడా ప్రధానమంత్రితో సమావేశమ్యే ఆలోచన చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్రం నుంచి తెలంగాణకు లక్ష కోట్ల వరకూ రావాల్సి ఉందని.. గతంలో కేటీఆర్ వాదిస్తూ వచ్చారు. అంత కాకపోయినా ఇప్పటికిప్పుడు రావాల్సిన వాటి ని విడుదల చేయిస్తే.. తెలంగాణ కొత్త ప్రభుత్వానికి కాస్త ఊరట లభిస్తుంది.

**ఆర్థికంగా ఎంతో కొంత రిలీఫ్ పొందాల్సిన స్థితిలో తెలంగాణ సర్కార్**

బీఆర్ఎస్ సర్కార్ ఈ ఆర్థిక సంవత్సారంతం వరకూ వివిధ పద్దతుల్లో రావాల్సిన ఆదాయాన్నిముందుగానే సమీకరించుకుని ఎన్నికల కోసం ఖర్చు చేసేసింది. అదే సమయంలో పెద్ద ఎత్తున పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు కూడా చెల్లించాల్సి ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ కొత్తగా ఇచ్చిన హామీలను అమలు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ నిధులు సమస్యగా మారనున్నాయి . అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర సహకారం కూడా ఉండాలని రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. రాజకీయంగా తీవ్రంగా విభేదిస్తాం కానీ పరిపాలన విషయంలో కేంద్రం సహకారం ఉండాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు.

**కిషన్ రెడ్డి సహకరిస్తారా ?**

రేవంత్ రెడ్డి ప్రయత్నాలకు కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లుగా చెబుతున్నారు. కిషన్ రెడ్డి సహకారంతో.. త్వరలో పలువురు కేంద్ర మంత్రుల్ని.. ప్రధానిని రేవంత్ రెడ్డి కలవొచ్చని చెబుతున్నారు. ఆయా శాఖల నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు.. ఇతర అంశాల పూర్తి సమాచారంతో.. ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు.

# నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

నేటి నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గత వారం సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం సభ వాయిదా పడింది. మరోవైపు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎన్నికకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. తెలంగాణ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ నుంచి ఎన్నికయ్యారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. గుడిసెల వెంకటస్వామి అల్లుడు అయిన గడ్డం ప్రసాద్ కుమార్ మూడోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యుడు కావడంతో పార్టీ హైకమాండ్ స్పీకర్‌గా ఎంపిక చేసింది. అసెంబ్లీ స్పీకర్ పదవికి ఇతర నామినేషన్లు రాకపోతే ఆయన ఎన్నిక ఏకగ్రీవమవుతుంది.

నేటి నుంచి తిరిగి ప్రారంభమయ్యే సమావేశాల్లో స్పీకర్ ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా ఎన్నుకోవాలని ఆ పార్టీ ఇప్పటికే నిర్ణయించింది. ఆయన ఒంటరిగా నామినేషన్ వేస్తే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. మరొకరు చేస్తే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. మరోవైపు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనేది బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం 15వ తేదీన ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 16వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని శాసనసభ, మండలిలో విడివిడిగా ప్రవేశపెట్టి చర్చిస్తారు. 17న కూడా సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి.

**కౌన్సిల్ కోసం కొత్త భవనం..**

తెలంగాణ శాసనమండలికి కొత్త భవనాన్ని నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబ్లీ హాల్ ప్రాంగణంలో శాసనమండలి సమావేశం జరుగుతోంది. అదే ప్రాంగణంలో కొత్త భవనాన్ని నిర్మించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలకు కొత్త భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఎర్రమంజిల్‌లో సాగునీరు, రోడ్ల నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ భవనం చారిత్రక (హెరిటేజ్) భవనాల జాబితాలో ఉంది. చిక్కుముడులను విప్పేందుకు నాటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.తాజాగా జూబ్లీహాల్ ఆవరణలోనే శాసనమండలి నూతన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో 1937లో జూబ్లీ హాల్ నిర్మించబడింది. హైదరాబాద్ రాష్ట్రం విలీనమైన తర్వాత అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చింది. 2006లో వైఎస్ఆర్ కౌన్సిల్‌ను పునరుద్ధరించినప్పటి నుంచి శాసనమండలి సమావేశాలు ఆ భవనంలోనే జరుగుతున్నాయి.

# వీర్లపల్లి శంకర్ ది బెస్ట్ అనేలా పనిచేస్తా

- **ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తా.**
- **అన్ని వర్గాలు స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చు.**
- **క్యాంపు కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**
- **భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు.**





**షాద్ నగర్,విశాలభారతి:** షాద్ నగర్ నియోజకవర్గంలో అన్ని వర్గాలు స్వేచ్ఛగా పనిచేసుకునే విధంగా పాలన సాగిస్తానని, ఎమ్మెల్యే గా "వీర్లపల్లి శంకర్ ది బెస్ట్" అని ప్రజలు అనుకునేలా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.బుధవారం సాయంత్రం షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన అధికార లాంచనాలతో పాటు పార్టీ ముఖ్య శ్రేణులు, ప్రజాప్రతినిధులు తదితరులతో కలిసి కార్యాలయంలో అడుగుపెట్టారు.ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో మొదటిసారిగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు ఎంతో విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని వారి విశ్వాసాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు. చెప్పిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల రుణం తీర్చుకుంటామని భరోసా ఇచ్చారు. షాద్ నగర్ నియోజకవర్గంలో నూతన సంప్రదాయాలకు, కొత్తఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు.అభివృద్ధి,సంక్షేమాల పరంగా నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే మీడియా, ప్రభుత్వ ఉద్యోగులు అన్ని విధాల సహకరించాలని, అప్పుడే నిస్వార్థమైన పరిపాలన అందించేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు.

మీడియా వాస్తవాలను ప్రజలకు నిర్భయంగా చెప్పినప్పుడే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానం పెరుగుతుందని అన్నారు. ఏలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు. అదేవిధంగా ఉద్యోగస్తులను కూడా ఏలాంటి ఇబ్బందులకు గురి చేయమని తన పార్టీ కార్యకర్తలు కూడా వినయ విధేయతలతో అందరిని మెప్పించే విధంగా పనులు చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, జెడ్పిటిసిలు పి.వెంకట్రాంరెడ్డి,విశాలశ్రావణ్ రెడ్డి, నందిగామ ఎంపీపీ ప్రియాంక గౌడ్, కొత్తూరు ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు

# పార్లమెంటు నమూనాలో తెలంగాణ అసెంబ్లీ

- **సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

పార్లమెంట్ నమూనా తరహాలో తెలంగాణ అసెంబ్లీ ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభ,శాసన మండలి ఓకే దగ్గర నిర్మాణం ఉంటుందన్నారు. శాసనసభ, శాసన మండలి మినహా మరే ఇతర బిల్డింగ్స్ అసెంబ్లీ ప్రాంగణం లోపల ఉండవని రేవంత్ తేల్చి చెప్పారు. ఇప్పుడు ఉన్న చెట్లను తొలగించకుండా మరింత గ్రీనరీ పెంచాలన్నారు. అసెంబ్లీ కి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైల్వే గేట్‌కు అనుకుని ఉన్న ప్రహరీ ఎత్తు పెంచాలన్నారు. మెంబర్స్ ఉదయం పూట వాకింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ రూపురేఖలను మార్చేందుకు సిద్ధమయ్యారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి అసెంబ్లీ ఆవరణమంతా తిరిగారు. అక్కడ పరిసరాలను పరిశీలించారు. అసెంబ్లీ భవన సముదాల రూపురేఖలు మార్చాలని నిర్ణయించారు.

పార్లమెంట్ భవనం తరహాలో తెలంగాణ అసెంబ్లీ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అసెంబ్లీ, మండలి ఒకే చోట ఉండాలని యోచిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ సెషన్ నాటికి పూర్తిగా మార్పులు జరగాలని అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ, మండలి ఒకే బిట్‌లా కనిపించేలా మార్పులు చేయాలని సూచించారు. పార్లమెంట్ తరహాలో ఉండాలని నిర్దేశించారు. పార్లమెంట్ వద్ద విజయ్ చౌక్ మాదిరిగా ఉండాలని స్పష్టం చేశారు.



**అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..**

అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. రైల్వే గేట్‌కు అనుకుని ఉన్న ప్రహరీ ఎత్తు పెంచాలని సూచించారు. మెంబర్స్ ఉదయం పూట వాకింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచే రేవంత్ రెడ్డి పాలనలో తనదైన మార్కు చూపిస్తున్నారు. ప్రగతి భవన్ ను ప్రజాభవన్ గా మార్చేశారు. అక్కడ ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. మరోవైపు శాంతి భద్రతలపైనా దృష్టిపెట్టారు. హైదరాబాద్, సైబరాబాద్ , రాచకొండ కమిషనరేట్స్ కు కొత్త సీపీలను నియమించారు. మరోవైపు డ్రగ్స్ ను కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపట్టారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వారంలోపే చకచకా నిర్ణయాలు తీసుకుంటూ తనదైన మార్క్ ను రేవంత్ రెడ్డి చూపిస్తున్నారు.



# పార్లమెంట్ నే రక్షించాలేని వారు ప్రజలను ఎలా రక్షిస్తారు ?

- **అధికారం కోల్పోవడం కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమే**
- **అంతిమంగా గమ్యం చేరేది బీఆర్ఎస్ పార్టీయే**
- **ఎమ్మెల్యే హరీశ్ రావు**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



పార్లమెంటుకు రక్షణ లేకపోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. లోక్‌సభలో బుధవారం జీరో అవర్ జరుగుతుండగా విజిటర్స్ గ్యాలరీ నుంచి ఇద్దరు ఆగంతకులు కిందకు దూకి గ్యాస్‌ను వదలడంపై మంత్రి స్పందించారు. పార్లమెంట్‌కే రక్షణ కల్పించని కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఎలా రక్షిస్తారని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపి భద్రత కట్టదితం చేయాలన్నారు.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డిని గెలిపించినందుకు శిరస్సు వంచి వందనం చేస్తున్నా. అధికారం కోల్పోవడం కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమే. అంతిమంగా గమ్యం చేరేది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ఫోన్ చేస్తే గంటలోపే మీ ముందుంటానని హామీనిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం . స్థానిక ఎన్నికల్లో కష్టపడి పని చేద్దామన్నారు. అధికార పార్టీ నాయకులు మానసికంగా ఇబ్బంది పెడతారు కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దన్నారు. రాబోయే రోజుల్లో ఎవరేంటో ప్రజలే గ్రహిస్తారు. పనితనం తప్పా పగతనం తెలియని వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. తప్పొప్పులను సవరించుకొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామన్ని వివరించారు. బీఆర్ఎస్ పార్టీకి ఒడిదుడుకులు సహజమే. కాంగ్రెస్ హామీల అమలు కోసం ప్రజల పక్షాన నిలబడతాం. కాంగ్రెస్ అభ్యర్థి సొంత మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ అడ్డుకట్ట వేసింది. నర్సాపూర్లో పుకార్లను పటాపంచలు చేసి విజయం సాధించామన్నారు.



# ప్రజా పోరాట అగ్నికణం సీతక్క

- **మంత్రిగా బాధ్యతలు స్వీకరణ**
- **శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్‌నాయకులు**



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** ప్రజాపోరాట అగ్నికణం, నేటి రాజకీయాల్లో విలువలకు ఆదర్శం, ఎన్నో అవరోధాలు దాటిన ప్రజా ఉద్యమకారిణి మంత్రి సీతక్క అని కాంగ్రెస్‌పార్టీ మునుగోడు నియోజకవర్గ నాయకుడు బట్టు జగన్‌యాదవ్‌అన్నారు. బుధవారం మంత్రి సీతక్క పంచాయతీరాజ్ , స్త్రీ , శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రేవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు సీతక్కను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బట్టు జగన్‌యాదవ్‌మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను మంత్రి దృష్టి తీసుకెళ్లామన్నారు. మునుగోడు బై ఎలక్షన్‌టైమ్‌లో ఎంతో సీతక్క పార్టీ కోసం ఎంతో కష్టపడ్డరన్నారు.



# మల్లారెడ్డిపై 420 చీటింగ్ కేసు

- **ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు**
- **అతని అనుచరులపై కూడా కేసు నమోదు**

**విశాలభారతి,హైదరాబాద్:**



మాజీ మంత్రి మల్లారెడ్డి అతని అనుచరులు 9 మందిపై 420 చీటింగ్ కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శామీర్పేట్ పోలీసు స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. గిరిజనుల భూములు కబ్జా చేశారని ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మల్లారెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. 47 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో భూమిని రాత్రికి రాత్రి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మార్వోతో పాటు మల్లారెడ్డిపై ఫిర్యాదు రావడంతో నాలుగు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. శామీర్‌పేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని సర్వేనెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుటల ఎస్టీ (లంబాడీల) వారసత్వ భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని బినామీ అనుచరులు 9 మంది అక్రమంగా కబ్జా చేసి, కుట్రతో మోసగించి భూమిని కాజేశారని శామీర్‌పేట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయ్యింది.

విచారణ చేపట్టిన పోలీసులు మాజీ మంత్రి, అతని అనుచరులు, మల్లారెడ్డి బంధువు శ్రీనివాస్ రెడ్డి, కేశవాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త గోనె హరి మోహన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (డిసిఎంఎస్) జిల్లా సహకార సంఘం వైస్ చైర్మన్ శామీర్‌పేట్ మండల వ్యవసాయ సహకార సేవా సంఘం చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి శివుడు, స్నేహ రామిరెడ్డి, రామిడి లక్ష్మమ్మ, రామిడి నేహా రెడ్డిలపై శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ 420 చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు కేతావత్ బిక్షపతి నాయక్ మాట్లాడుతూ మల్కాజిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుంటల భూమి మా పెద్దల నుండి మాకు వారసత్వ హక్కుగా వచ్చిందన్నారు. మా కుటుంబ సభ్యులైన ఆరుగురి పేరు మీద మొత్తం భూమి ఉందని అన్నారు. ఈ భూమిపై కన్నేసిన స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఈ భూమిని ఎలాగైనా కాజేయాలని కుట్రతో తన అనుచరులతో కలిసి మాకు మాయ మాటలు చెప్పి నమ్మించి మా ఏడుగురితో 250 కోట్ల విలువ చేసే భూమిని పీటీ సరెండర్ చేయించారని పేర్కొన్నారు. మా భూమిపై మేము హక్కులు కోల్పోయేలా చేసి ఎస్టీ లంబాడీలమైన మాపై అట్రాసిటీ పాల్పడినారని, మా ఏడుగురుకి ఒక్కొక్కరికి మూడు లక్షల చొప్పున డబ్బు ఇచ్చి భూమి తీసుకున్నారని తెలిపారు.



# ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేయాలి

**జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి**

**భీమదేవరపల్లి,విశాలభారతి:** తొలి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ పై తీర్మానం చేసి అఖిలపక్షని ఢిల్లీకి తీసుకెళ్లాలి మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ టిఎస్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి పేర్కొన్నారు. మండలంలోని ముల్కనూరులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లగా మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఏర్పాటుచేసిన ఉష మెహ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను వర్గీకరణ నివేదిక అందజేసిందన్నారు. వర్గీకరణతోనే రాజ్యాంగబద్ధంగా మాదిగ మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో సభలలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడాలని గుర్తు చేశారు జరుగుతున్న తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ పై తీర్మానం చేయడమే గాక అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర పై ఒత్తిడి తేవలన్నారు ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు కొమ్మల నాగేష్, కొమ్ముల రవీందర్,అంబాల బక్క రాజు, గడిపే వీర స్వామి, గడిపే మొగిలి, నల్లగొండ శంకర్,కొమ్ముల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేత

**భీమదేవరపల్లి,విశాలభారతి:** మండలం కేంద్రం లోని ముల్కనూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ కార్మికులకు ఉపయోగపడే విధంగా ఈ దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు. రానున్న రోజుల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఉచితంగా మందులు పంపిణీ కార్యక్రమం, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పూర్ణ చందర్, జడ్పిటిసి వంగ రవీందర్ గౌడ్, ఎంపీటీసీ అప్పని పద్మ, సంపత్, కొత్తకొండ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కొలుగురి రాజు, ఆదరి రవీందర్, చిదురాల స్వరూప, అశోక్ ముఖర్జీ, గోపి, గుడికందుల రాజు, చిట్కురి అనిల్, పోగుల శ్రీకాంత్, ప్రమోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**నూతనకల్, విశాలభారతి:** దేశవ్యాప్తంగా గ్రామీణ తపాల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిరవధిక సమ్మె బాట పట్టారు. దానిలో భాగంగా బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని తపాల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిడిఎస్ ఉద్యోగులను చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేయిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తపాల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జిడిఎస్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సీనియర్ ఉద్యోగుల కు 12, 24, 36 సర్వీస్ కల్పించి, ఇన్సూరెన్స్ 5 లక్షలకు పెంచాలని వారు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర నాయకులు పిలుపుమేరకు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు.



# మేలు రకం విత్తనంతో మిర్చి పంట అధిక దిగుబడి

**తిరుమలాయపాలెం, విశాల భారతి:** మేలురకం విత్తనాలు ఎంచుకొని పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చు అని హెనిష్ఠ సీడ్స్ మార్కెటింగ్ మేనేజర్, రామచంద్ర రెడ్డి అన్నారు.

హెనిష్ఠ సీడ్స్ ఇండియా ప్రై లిమిటెడ్, భీష్మ అనే విత్తనం అధిక వర్షాన్ని వర్షాభావాన్ని సైతం అన్ని చీడపీడల తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడిని సాధిస్తుందని అన్నారు తిరుమలాయపాలెం మండలంలోని తేట్టెల పాడు పలు గ్రామాల్లో ఈర్ల వెంకన్న అనే రైతు భీష్మ అనే కొత్త సంకరజాతి మిరప విత్తనం సాగు చేశారు నాటిన దగ్గర నుండి మిరప పంట ఏపుగా పెరిగి మంచి పూతకాపుతో ఉందని ఎలాంటి వైరస్ తెగుళ్లు వ్యాపించలేదని అన్నారు.

మిగతా విత్తనాలు పూత కాపు దశ లో రకరకాల తెగుళ్ళ లక్షణములు మేము గమనించడం జరిగిందన్నారు భీష్మ అనే విత్తనం 5055 రోజు లకి పచ్చి కాయ ఎండిన కాయ 8090 రోజుల కి వస్తుంది, కాయ పొడవు 89 సింటిమీటర్లు, పడవతో మంచి రంగును కలిగి ఉంటుందని మార్కెట్లో అధిక ధర పలుకుతుందని ఎకరాకు 70 వేల రూపాయల ఖర్చు రాగా ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వారి వివరించారు భీష్మ విత్తనాన్ని సంవత్సర కాలంలో ఎప్పుడైనా సాగు చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల రైతులు పాల్గొని పంటను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.హెనిష్ఠ సీడ్స్ కంపెనీ యాజమాన్యం మార్కెటింగ్ మేనేజర్, రామచంద్ర రెడ్డి, బెంగళూరు, టీఎస్ ఎం పెద్ద రసూల్, గుంటూరు, ఎస్ ఓ మధుకోటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన మరిపెడ వీఆర్ ఏ యూనియన్





**మరిపెడ,విశాలభారతి:** నూతన ఎమ్మెల్యేను మరిపెడ ఎమ్మెల్యే హౌస్ లో మరిపెడ విఆర్ఎల సంఘం బొకే ఇచ్చి సన్మానం చేయడం జరిగింది. అనంతరం వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు తుల్లా హుస్సేన్ ఎమ్మెల్యే గారితో 14వ తారీకున జరిగే శాసనసభలో వీఆర్ఏల ఐడీ ల గురించి. పిహెచ్సి వర్కర్ల. వారసత్వ ఉద్యోగాలు .సమ్మె సమయంలో జీతాల గురించి 33% పిఆర్సి గురించి .33 జిల్లాల్లో 612 మండలాల్లో పూర్తిస్థాయిలో ఎలక్షన్ల విధుల్లో పనిచేశాము. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా వీఆర్ఏల కృషి ఎంతో కీలకమైనది వీఆర్ఏలు సమ్మె దినలలో జీతాలు రాక ఎంతోమంది, కుటుంబం గడవక ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మా సమస్యలను 14వ తేదీన అసెంబ్లీలో సంబంధిత రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వానికి అసెంబ్లీలో విఆర్ఏ లా సమస్యలపై డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ను విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఉస్సేన్ తూళ్ళ,విఆర్ఏ లు నాగమణి,వినయ్,రాజు,నాగరాజు, తిరుపయ్య, ప్రణయ్,విజయ, ఖాదర్ ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**భీమదేవరపల్లి,విశాలభారతి:** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల దరఖాస్తు చేసుకున్న కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. బుధవారం భీమదేవరపల్లి 9, గట్లనర్సింగపూర్13, కొప్పూర్8, కొత్తకొండ 13, కొత్తపల్లి 9, మల్లారం 15, మాణిక్యాపూర్11, ములుకనూరు36, ముస్తఫాపూర్5, ముత్తారం3, రత్నగిరి4, వంగర10 గ్రామాల్లో మొత్తం136 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కోటి 36 లక్షల 15 వేల రూపాయలు గల చెక్కులను సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయంలో అందించినట్లు తహసిల్దార్ ఏవి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జడ్పిటిసి వంగ రవి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



**జఫర్‌గఢ్, విశాలభారతి :** జిల్లా జఫర్‌గఢ్ సబ్ పోస్ట్ ఆఫీస్ లోని జిడియస్ ఉద్యోగులు 2వ రోజు నిరవధిక సమ్మెను కొనసాగించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెలో భాగంగా జిడియస్ ఉద్యోగులకు సివిల్ సర్వంట్ హోదా కల్పించాలని సీనియర్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5.లక్షలకు పెంచాలని,కుటుంబ సభ్యుల తో సహా వైద్య సదుపాయం కల్పించాలని,ఇన్సెంటివ్ పద్ధతి రద్దు చేయాలని, టార్గెట్ రూపంలో వేదింపులు ఆపివేయాలని కమలేష్ చంద్ర కమిటీ సిఫార్స్ చేసిన బంచింగ్ అమలు చేయాలని కోరారు.జిడియస్ సెలవులో ఉన్నపుడు సబ్ స్టిట్యూట్ అను మతించాలని అనేక రకాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ సమ్మెలో తపాలా ఉద్యోగులు అంకూస్, వీరూ సాయి, రోహిత్, బాలు,నితిన్, సురేష్,పవన్,లక్ష్మణ్ పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసులను విస్తరించాలి

- గుర్తింపు కార్డు సమస్య ఉచిత ప్రయాణానికి ఆటంకం కాకూడదు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు డిమాండ్



**మోతె, విశాల భారతి:** కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, ఆరోగ్యశ్రీ పరిమితి రు.10లక్షలకు పెంచిందని, ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల్లో భాగంగా రెండు వాగ్దానాలను తక్షణం అమలు చేయటం హర్షణీయం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ రాష్ట్రంలో సుమారు నాలుగువేల గ్రామాలకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందువల్ల గ్రామీణ నిరుపేద మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పల్లెవెలుగు, ప్యాసింజర్ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే పరిమితం చేయడంతో దూరప్రయాణం చేసే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పరిమితంగానే అందుబాటులో ఉంటుందన్నారు.అందువల్ల ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని ప్రతి గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డు గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. గుర్తింపు కార్డు సమస్య వల్ల ఏండ్ల తరబడి ఇక్కడ పనిచేస్తున్న వలస కూలీలు, గుర్తింపు కార్డు లేని పేద కుటుంబాల మహిళలకు ఆటంకం కాకుండా చూడాలని కోరారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఉపయోగమైనప్పటికీ, ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.



# దివ్యాంగులకు క్రీడా పోటీలు

**సూర్యాపేట, విశాలభారతి:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీ పద్మ అధ్యక్షతన బుధవారం జిల్లాలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డి ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు సామాజికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా విపక్షత కు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని అన్నారు .దివ్యాంగులు క్యారం బోర్డ్, చెస్, పరుగుపందెం,షార్ట్ పుట్ లో , జావలిన్ త్రో, కబడ్డీ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి డిసెంబర్ 15న శుక్రవారం రోజు జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, నాయకులు, సిడీపీవో లు,కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ వ్యవహారంతో యువతీ ఆత్మహత్య



**భీమదేవరపల్లి,విశాల భారతి:** భీమదేవరపల్లి మండల కేంద్రంలో యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన చెప్యాల ఆనందం చిన్న కూతురు హరిప్రియ (25) హనుమకొండలో నర్సింగ్ పూర్తి చేసి హైదరాబాదులో ప్రైవేటు హాస్పిటల్ లో పని చేస్తూ అనారోగ్యం తో గత ఆరు నెలలుగా ఇంటిపట్టున్నే ఉంటుంది.అయితే హరిప్రియ ఆదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్ (28) తో పరిచయం ఏర్పడింది.ఐదేళ్ళు గా పరస్పరం ప్రేమించుకున్నారు. గుర్రపు రాజేష్ ను పెళ్లి చేసుకోమని అడగగా రాజేశ్ వివాహనికి అంగీకరించక పోవడం, గొడవ పడడం తో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హరిప్రియ మృతి చెందడంతో ధర్మారం లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.చెప్యాల ఆనందం తన కూతురు చావుకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని ఎస్సై సాయిబాబు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ భూమి కబ్జా



**మోతె, విశాల భారతి:** ప్రభుత్వ భూమి కబ్జా చేసిన ఘటన బుధవారం మండల కేంద్రం చోటు చేసుకున్నదని మండల కేంద్రానికి చెందిన యూత్ తహశీల్దార్ ప్రకాశ్ రావుకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. గత ముప్పై సంవత్సరాల క్రితం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమిలో కొంత బాగం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించగా కొంత భూమిని క్రీడా ప్రాంగణం కోసం కేటాయించడం జరిగిందని అట్టి క్రీడా ప్రాంగణం ను కబ్జా చేస్తున్నారని క్రీడా ప్రాంగణం భూమిని కాపాడాలని తహశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు లచ్చు మళ్ళ రాజు అనిల్ గోపీ గనేష్ తదితరులున్నారు.



# దాతల సహకారంతో ఉన్నతంగా రాణించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి కే.రాము**

**జఫర్ గడ్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దాతలు అందించే సహకారాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని జనగామ జిల్లా విద్యాశాఖా ధికారి కె.రాము అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పుగల్ పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యులు చిల్లర భగవంత్ అందించిన ఇడ్లీ పాత్రను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థినీ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దాతల సహకారం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం అవుతుందని,ఉపాధ్యాయులు ప్రజల భాగస్వామ్యం కొరకు ప్రయత్నం చేయాలని అన్నారు. ఉప్పుగల్ పాఠశాల అభివృద్ధి ప్రాథంగా నడుస్తోందని అందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.కిషన్ కుమార్,యస్. వెంకటపతి, కె.వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్ రెడ్డి , పి.మనోహర స్వామి, సభ్యులు భగవంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఆంథోనీ సేవలు చిరస్మరణీయం

**బిషప్ డా దుర్గం ప్రభాకర్ సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు**

**సూర్యాపేట, విశాలభారతి:** పెన్ పహాడ్ పాస్టర్ రెంటాల ఆంథోని సేవలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దుర్గం ప్రభాకర్ పెన్ పహాడ్ మండల కేంద్రం నందు బెతేల్ గ్లోబల్ చర్చ్ నందు పాస్టర్ రెంటాల ఆంథోని (రవి కుమార్) మొదటి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ రవి కుమార్ క్రీస్తు సేవలో ఎంతో మంది పాస్టర్స్ కు అతిధ్యం ఇచ్చి పేద పాస్టర్స్ కు సువార్తకు చేయూతనందించేవారని కొనియాడారు. వారు గుండెపోటుతో మరణించడం బాధాకరమని అన్నారు. వారు లేని లోటు క్రిస్టియన్స్ లోకానికి తీరనిదని అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ సతీమణి విజయలక్ష్మి, కావనెంట్ చర్చ్ జిల్లా నాయకులు పాస్టర్ అల్లూరి అబ్రాహాము,బిషప్ డా యం. పి. హెచ్. హెచ్. మోజెస్,పాస్టర్స్ జాన్ ప్రకాష్, రాజారత్నం, జీవరత్నం,యల్క ప్రభాకర్,లాజర్, ఏసు రత్నం, సుధాకర్,డికెన్ ఫాదర్ యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన కార్తిక పూజలు



**సూర్యాపేట, విశాలభారతి:** కార్తికమాసం ముగింపును పురస్కరించుకోని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో బుధవారం ఆకాశదీపం పూజలు నిర్వహించి కార్తిక మాసం పూజలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు భట్టారం వంశీకృష్ణ శ్రీ సత్య సాంబ శివ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ధ్వజం స్తంభం పై ఉన్న ఆకాశ దీపాన్ని క్రిందకు దించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపారాధ... ప్రాశస్త్యం ఉందన్నారు. కార్తీక మాసం మొదటి రోజున ప్రారంభమైన ఆకాశదీపం నెలరోజులు పూజలందుకొని ముగింపు కార్యక్రమం నిర్వహించి నట్లు తెలిపారు. కార్తీక మాసంలో దీపారాధన ప్రాశస్త్యం తెలుపుతూ పోలీ స్వర్గం కథను భక్తులకు వివరించారు. కార్తీక మాసం నెల రోజులు శివాలయంలో దీపం వెలిగించకున్నను చివరి రోజున దీపం వెలిగిస్తే నెల రోజుల ఫలితం ఒక్కరోజులోనే కలుగుతుందని వివరించారు .ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహండ్లపల్లి మురళీధర్ ,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మిగతా 4 లో



## ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్

**చిట్యాల, విశాలభారతి:** నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ని చిట్యాల మండలం వెల్మినేడు గ్రామం సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాపయ్య క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేశబోయిన లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పార్లమెంట్ బరిలో పంజా కల్పన



**తొర్రూర్ విశాలభారతి:** తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన పంజా కల్పన ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ పాలకుర్తి నియోజకవర్గంలో సూపరిచితురాలుగా ఉంటూ త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ (ఎస్సీ) నియోజకవర్గం నుండి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుంది. 17 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన పంజా కల్పన సమాజ సేవ చేయాలనే దృఢ నిశ్చయంతో 25 సంవత్సరాల తన సర్వీస్ ను ప్రభుత్వ ఉద్యోగాన్ని ఛేజించి గత ఐదు సంవత్సరాల నుండి సమాజ సేవే పరమావధిగా ముందుకెళ్తున్నారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ గా సేవలందించి పాలకుర్తి నియోజకవర్గం, ఇతర నియోజకవర్గంలో మండలాలకు చెందిన ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షలకు తర్ఫీదునిచ్చి వారిని ముందంజలో ఉంచడంలో వారు చాలా కృషి చేశారు. అదేవిధంగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా మహిళాలకు ఉచితంగా భోజన, వసతి కల్పించి టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లను పంపిణీ చేశామని వారు తెలిపారు. మహిళా సాధికారత కోసం తన వంతు సహకారం అందిస్తూ వారి సంక్షేమానికి తనకు తోచిన విధంగా తోడ్పాటును అందిస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్నప్పుడు ఉద్యోగ సంఘంలో వివిధ పదవులను బాధ్యతగా నిర్వర్తించి ఉద్యోగ సంఘంలో కొనసాగేటప్పుడు వరంగల్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఉన్నటువంటి మేధావులతో ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థులతో, వివిధ కుల సంఘాలతో, మహిళ సంఘాలతో, నిరుద్యోగ యువతీ యువతతో మమేకమై సమస్యల పట్ల ఉద్యమించారని ఇలాంటి నిస్వార్థం ప్రజా సేవకురాలు సమాజానికి ఎంతో అవసరమని అందులో భాగంగానే వరంగల్ పార్లమెంటు స్థానానికి పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారని తొర్రూర్ డివిజన్ చుట్టుపక్కల నియోజకవర్గం మేధావులు విద్యావేత్తలు కుల సంఘాలు యువజన సంఘాలు మహిళా సంఘాలు రాజకీయ విశ్లేషకులు పలువురు చర్చించుకుంటున్నారు.



## ఉద్యోగులను పర్మినెంట్ చేసే చర్యలు ప్రారంభించాలి

**తొర్రూర్, విశాల భారతి:** గత ప్రభుత్వం అనుసరించిన పలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఓడిపోయిన టిఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పర్మినెంట్ చేసే చర్యలు ప్రారంభించాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్టియు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. నేడు తోరూరులోని సిపిఐ (ఎంఎల్) ప్రజాపందా పార్టీ కార్యాలయంలో ఐ ఎఫ్ టి యు తొర్రూరు ఏరియా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏరియా కమిటీ ఉపాధ్యక్షుడు రాయిశెట్టి రాజశేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో అష్టకష్టాలు అనుభవిస్తున్నారని అన్నారు. వారందరినీ పర్మినెంట్ చేయటానికి కావలసిన చర్యలకు నేటి నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపక్రమించాలని కోరారు. ప్రధానంగా మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ,కస్తూరిబా గాంధీ నాన్ టీచింగ్ సిబ్బంది,మోడల్ స్కూల్స్ హాస్టల్ సిబ్బంది తో పాటు గా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ వెంటనే పర్మినెంట్ చేయాలని అన్నారు. హమాలి అండ్ మిల్ ఆపరేటర్స్ కు ఉపాధి భద్రతతో కూడిన చట్టాన్ని తీసుకురావాలని కనీస వేతనం అమలయేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్కూల్ బస్సు, హైర్ బస్ డ్రైవర్స్, షాప్ వర్కర్స్,ఆటో,మోటార్,ట్రాక్టర్ డ్రైవర్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి భవన నిర్మాణ కారికి కార్మికుల మాదిరిగా ఆయా కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్న వివిధ రకాల ప్రోత్సాహక నిధులను రెట్టింపు చేయాలని రవి కోరారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణాల వల్ల ఉపాధి కోల్పోతున్న లక్షలాది మంది ఆటో కార్మికుల కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలని లేదంటే తెలంగాణలో గత ప్రభుత్వానికి పట్టిన గతే కేంద్రంలోని బిజెపికి పడుతుందని రవి హెచ్చరించారు.



## పూర్తి కాలం పదవిలో కొనసాగుతా

- ఎంపీటీసీల మద్దతు నాకే ఉంది
- ఎంపీపీ మాధవి

**నెల్లికుదురు, విశాల భారతి:**
మండల పరిషత్ అధ్యక్షురాలు గా పూర్తి కాలం పాటు ఎంపీటీసీల మద్దతుతో కొనసాగుతానని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవీ నవీన్రావు ధీమావ్యక్తంచేశారు. మండలకేంద్రంలోనెల్లికుదురులోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోబుధవారంవిలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదవీకాలం 2024 జులై 4 వరకు అందని అవిశ్వాసం అపోహఅని ఇద్దరు ఎంపిటిసిలు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెసులో చేరినంత మాత్రాన వారి మద్దతు సైతం తనకేఉంటుందని తెలిపారు. ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు ఎవరు అధైర్యానికి గురి కావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎర్రబెల్లిగూడెం ఎంపీటీసీ అనిల్,నరసింహులగూడెం కృష్ణ,నెల్లికుదురు వాణి శ్రీనివాస్,శ్రీరామగిరి ఎంపీటీసీ సుభాషిణి కళాధర్ రాజు, మదనతుర్తి ఎంపీటీసీ దూడి హనుమంతు వావిలాల ఎంపీటీసీ ఆమని మంగ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సమయమిద్దాం.. సత్తా చాటుదాం

**నెల్లికుదురు, విశాల భారతి:**
కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి ఇచ్చిన హామీల అమలు కోసం. సమయం ఇద్దామని, అమలు చేయకుంటే పోరాడుదా మని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు.త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలలో విజయం సాధించి బిఆర్ఎస్ కు పూర్వ వైభవం తీసుకువచ్చి సత్తా చాటుదామని ఆయన నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎలక్షన్లలో గెలుపు ఓటములు సహజమని ఎవరు అధైర్య పడవద్దని తాను మానుకోటలోనే ఉండి పార్టీ నాయకులను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాననిశంకర్ నాయక్ అన్నారు. మండల బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పరిపాటివెంకటరెడ్డిఅధ్యక్షతనబుధవారం జరిగింది. దీనికి శంకర్ నాయక్ ,హాజరైమాట్లాడుతూ..రైతులకు,కార్మికులకు,బీసీలకు,దళితులకు,యువతకు,విద్యార్థులకు,నిరుద్యోగులకు ఏరాశి అన్ని వర్గాల వారికి ఏనాడూ ఏ ప్రభుత్వం చేయనన్ని పథకాలు అభివృద్ధి పనులు పనులు కేసీఆర్ ప్రభుత్వం చేసిందన్నారు.తన నూ,బిఆర్ఎస్ ను ఎందుకు ఓడించామా అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఆలోచనలో పడుతున్నారన్నారు. ఎన్నికలలో ఓడినందున శంకర్ నాయక్ ఇక్కడ ఉండడని వెళ్ళిపోతాడని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని అది వారి అపోహ మాత్రమే అన్నారు. కొందరు పార్టీ నాయకులు పార్టీలో కొనసాగుతూనే ఓటమి కోసం వెన్నుపోటు పొడిచారని వారి తీరు అధిష్టానం దృష్టికి తీసుకు వెళుతున్నట్లు తెలిపారు.

## ఉచితం వద్దు ఉపాధి కావాలి



**భద్రాచలం, విశాల భారతి:** కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితల పేరు మీద తెలంగాణ ను అప్పుల పాలు చేయటమే తప్ప ప్రజలకు ఉపయోగపడేది లేదని మహాజన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర అధ్యక్షులు కంగాల రమణకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ముఖ్య ఉద్దేశం నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్థం చేసుకోవాలని ఆమె తెలిపారు. నీళ్లు నిధులు నియామకాలు పేరుమీద తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగిందని ఆమె అన్నారు కెసిఆర్ ప్రభుత్వం దాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక పాలన చేశారు. కనుక ప్రజలు తిరస్కరించారని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో భూమి లేక అనేక కుటుంబాలు ఉన్నాయని భూమిలేని కుటుంబాలకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేయాలని అలాగే నిరుద్యోగ యువతీ యువకులకు తక్షణమే ఉపాధి కల్పించే విధంగా ఇండస్ట్రీలు ప్రోత్సహించాలని ఉపాధి చూయించాలని ఆమె అన్నారు. ఉచితల పేరు మీద ప్రభుత్వం అభాష్ పాలు అవద్దని ఆర్థిక నష్టం జరిగిన కుటుంబాలను గుర్తించి ఉపాధి చూపించాలని వ్యవసాయ భూమిని ఉపాధిని కల్పిస్తే తెలంగాణలో నిరుపేద కుటుంబాలు వీధిన పడకుండా ఉంటాయని ఆమె తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుపేద కుటుంబాల ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని అన్యకాంతమైన భూములను స్వాధీన పరచుకొని ప్రభుత్వ భూములను గుర్తించి భూమిలేని నిరుపేదలకు భూమి పంచితే నిరుపేదలు రేవంత్ రెడ్డిని గుండెల్లో పెట్టుకుంటారని ఆమె అన్నారు ఉచిత పథకాలు పెట్టి మళ్ళీ ప్రజలను మోసం చేయొద్దని మళ్లీ తెలంగాణ అప్పుల పాలు అవటం తప్ప ఉపయోగం లేదని ప్రజల పైన నిత్యవసర వస్తువుల ధరలు టాక్సెస్ పెరిగి ఇబ్బందులకి గురి చేయడమే తప్ప మరొకటి కాదని ఆమె అన్నారు.



## ప్రజా సేవకుడు నాగిల్ల యాదయ్య జిట్టా నగేష్

**ఘనంగా నాగిళ్ళ యాదయ్య వర్ధంతి**

**చిట్యాల, విశాలభారతి:** పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పని చేసిన కామ్రేడ్ నాగిళ్ళ యాదయ్య సేవలు మరువలేనివని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు శివనేనిగూడెం బుధవారం యాదయ్య వర్థంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివనేనిగూడెం గ్రామ సర్పంచ్ గా, ప్రజా నాట్య మండలి కళాకారుడిగా, సిపిఎం మండల కమిటీ సభ్యుడిగా నాగిళ్ళ యాదయ్య చేసిన పనులు అభినందనీయం అన్నారు. కడవరకు కమ్యూనిస్టు కార్యకర్తగా, నాయకుడిగా పనిచేసిన యాదయ్య అనారోగ్యం కారణంగా మరణించడం బాధాకరమని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మినారాయణ, ఐతరాజు యాదయ్య, యాదయ్య కుటుంబ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాలమాకుల అర్జున్, చొప్పరి లింగయ్య, పోతులూరి, బొబ్బిలి వెంకట్ రెడ్డి, నాగిళ్ళ కిరణ్,లచ్చయ్య , సుగుణమ్మ, జిట్ట రేణుక తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కేవైసికి చివరి తేది లేదు

- వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు
- అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డి



**సూర్యాపేట,విశాలభారతి:** గ్యాస్ కేవైసి నమోదుకు చివరి తేది అంటూ లేదని, అపోహలను ప్రజలు నమ్మొద్దని జిల్లా అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డి తెలిపారు. బుదవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయిల్ కంపెనీ ఏజెన్సీల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవైసి పేరుతో అపోహలు సృష్టించి, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. కేవైసి నమోదు ప్రతి రెండేళ్లకు ఒక సారి జరిగే సాధరణ పక్రియ అని, ఈ విషయాన్ని ఏజెన్సిలు వినియోగదారులకు తెలుపాలన్నారు. కేవైసి నమోదు సమయంలో సురక్ష పైపులను బలవంతంగా అంటగట్టవద్దని, అవసరం ఉన్న వారు పైపులను కొనుగోలు చేసుకొవచ్చన్నారు. రూ. 500 సిలిండర్ సరఫరాపై ప్రభుత్వం నుంచి ఏలాంటి ఆదేశాలు రాలేదని, కేవైసీ నమోదుకు ఈ పథకానికి సంబంధం లేదని ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ అధికారులు, గ్యాస్ డిస్టిబ్యూటర్లు తదితరులు పాల్గోన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలి

**రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి**




**సూర్యాపేట, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి వేతనాలు లేకుండా ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా నడుస్తూ ఉచితంగా ప్రజా సేవ,ప్రభుత్వ సేవ చేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా జర్నలిస్టు స్కీం తీసుకొొచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 24 వేల మంది పాత్రికేయ కుటుంబాల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. మీడియా సహాయం లేకుండా ఏ ఒక్కరూ అధికారంలోకి రాలేరని తెలిపారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఈ సమావేశం ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ఉచిత విద్యుత్తు ఇవ్వడంతోపాటు హెల్త్ కార్డులు,ప్రభుత్వ గుర్తింపు కార్డులు పోలీస్ భరోసా కార్డులు ఇప్పించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా చూడాలన్నారు. జర్నలిస్టులకు వృత్తిరీత్యా తగిన గౌరవ మర్యాదలు గుర్తింపును ప్రభుత్వం ఇవ్వాలన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు లేదా ప్రత్యేక గృహాన్ని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీంతోపాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు.
ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థలు ఇచ్చిన గుర్తింపు కార్డుల ఆధారంగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న వారి కి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించి జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అవ్వాలని కోరారు. నూతనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులకు శాసన సభ్యులందరికీ అసోసియేషన్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధూపాటి శ్యాంబాబు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది

- రైతులెవ్వరు ఆందోళన చెందవద్దు
- ప్రతి ఒక్క పంటని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాయం



**మణుగూరు,విశాల భారతి :** మించౌంగ్ తుఫాను వలన నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గం వ్యాప్తంగా నష్టపోయిన రైతులందరూ ధైర్యంగా ఉండాలని రైతులను ఈ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందనీ వారు అన్నారు. నియోజకవర్గంలో నష్టపోయిన ప్రతి పంటని వ్యవసాయ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంజన వేసి రైతులకు అందజేస్తామని వారు తెలిపారు. పూర్తిగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనడానికి సిద్ధంగా ఉందని రైతాంగం ఆందోళన చెందవద్దని వారు కోరారు. ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని రైతులందరూ ధైర్యంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు మీ వద్దకే వచ్చి సర్వే చేస్తారని వారు అన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు ఐకెపి సెంటర్ ఏర్పాటు చేసి రైతుల దగ్గర నుండి పంటని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

**గరిడేపల్లి, విశాల భారతి:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం గ్రామం నందు క్రిస్మస్ పండగ సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మైదానం రాయిని గూడెం ప్రాంగణంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు డిసెంబర్ 21, 22 ,23, 24 తేదీలలో నిర్వహించనున్నారు. రాయినిగూడెం గ్రామం అంబేద్కర్ యూత్ సభ్యులు మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరిడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు క్రీడా అభిమానులు క్రీడాకారులు పాల్గొని కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ టీం సభ్యులు తెలిపారు. వివరాలకు మరియు దాతలు ఎవరైనా 9542123924, 9550352534,8978682840 మొదలైన ఆర్గనైజింగ్ ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని వారు తెలిపారు.







## రైతు క్షేత్రాల సందర్శన

**చిగురుమామిడి, విశాల భారతి:** చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో IKEA, డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా ప్రతినిధులు పత్తి ఆధారిత అటవీ వ్యవసాయంలో భాగంగా రైతు క్షేత్రాలను సందర్శించారు. ఈ సమావేశంలో సుస్థిరమైన నేల యాజమాన్యం, పునరుత్పాదక వ్యవసాయం పై రైతుల అభిప్రాయాలు ఆలోచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్వీడన్ ప్రతినిధులు ఉల్ఫ్ జాన్సన్ మాట్లాడుతూ రైతులు పాటిస్తున్న పునరుత్పదక వ్యవసాయం చాలా బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఇర్మా విమ్బార్గ్, రాచెల్లి గ్రహం,అరవింద్ రేవల్, శ్రీనివాసన్ డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ప్రతినిధులు మురళీధర్, సుమిత్ రాయ్, వంశీకృష్ణ, గార్గి ఉపాధ్యాయ్, ముఖేష్ త్రిపాఠి,హర్ష శంకర్, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, నవ క్రాంతి, కేశపూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(ఎ ఫ్ పి సి ఐ) అధ్యక్షులు ఉగ్గే శేఖర్,ఎడెల్లి రవీందర్ రెడ్డి,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బోట్ల సతీష్ కుమార్, ఎస్ ఎల్ ఎం ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పారపు సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం, క్షేత్ర సిబ్బంది,వివిధ గ్రామాల నుండి 100కు పైగా రైతులు పాల్గొన్నారు.



## డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో వైద్య శిభిరాలు ఏర్పాటు

**అశ్వాపురం, విశాల భారతి :** మండల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ మామిళ్ళవాయి, రామచంద్ర పురం గ్రామ పంచాయతీ సత్యనారాపురం, కట్టవారి గూడెం గ్రామల లో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు గ్రామాలలో డెంగ్యూ, మలేరియా జలుబు, దగ్గు వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందు వలన గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. టెమోపాస్ రాఫీడ్ ఫీవర్ సర్వే, ఆంటీ లార్వా లు వంటి సర్వే లు చేయడం జరిగిందని, చలికాలం కావటం వలన ప్రజలు తీసుకోవలసిన జాగ్రతలు ఫ్రిజ్ లు, కులర్స్, కొబ్బరి బొండాలలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చుట్టూ ప్రక్కల పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలని అవగాహనా కల్పించినట్లు ఆమె తెలిపారు.



## సిఐటియుని గెలిపించండి

**మణుగూరు,విశాల భారతి:** లంచాలు లేకుండా కారుణ్య నియామకాలలో నియామకాలు ఇప్పిస్తాం ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటువేసి సిఐటియుని గెలిపించాలని సిఐటియు పిలుపునిచ్చింది. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో పీకే ఓసి సి ఎస్ పి లో గేట్ మీటింగ్ లో సింగరేణి సిఐటియు సింగరేణికాలరీస్ ఎప్లాయిస్ యూనియన్ తో బుధవారం నాడు రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మాచారి మాట్లాడారు. ఈ నెల 27 న ఎన్నికలలో ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కె .బ్రహ్మాచారి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ సమయంలో అవినీతి రాజ్యమేలుతుందని అన్నారు. అనీతివలన కార్మికులు కార్మిక కుటుంబాలలో ఎంతో ఆవేదనకు గురవుతున్నారనిఅన్నారు. సిఐటియు గెలిస్తే రూపాయి ఖర్చు లేకుండా వారికి ఉద్యోగాలు వచ్చే విధంగా సిఐటియు పనిచేస్తుందని హామి ఇచ్చారు. కార్మికుల సమస్యల కోసం ఎన్నో పోరాటాలు చేసిన సీఐటీయూ గెలిపించడం కోసం కార్మికులు ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేయాలనికోరారు. కోల్ ఇండియాలో కార్మికుల జరుగుతున్న ఒప్పందాలు రాష్ట్రంలో సింగరేణి కార్మికులకుఅమలు జరగటం లేదన్నారు. కోల్ ఇండియా వేతన ఒప్పందం అమలు కార్మికులకు కార్మికుల పక్షాన ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా నిజమైన పాలన అందించాలంటే సీఐటీయూ గెలిపించాలని వారు కోరారు.



# అయ్యప్ప మహా ఇరుముడి కార్యక్రమం

**గంట స్వామి గుగులోతు ప్రకాష్ నాయక్**

**మహబూబాబాద్ ,విశాల భారతి:** జిల్లా సీరోల్ మండలం ఏడిచేర్ల గ్రామంలోని రామాలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ యొక్క ఇరుముడి కార్యక్రమానికి బ్రహ్మశ్రీ సంజీవ నంబూద్రి గురు స్వామి హాజరై ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గంట స్వామి ప్రకాష్, గురు స్వామి కృష్ణ లు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి మాల 41 రోజుల దీక్షను నిష్ఠ నియమాలతో ధరించుతారు. అయ్యప్ప స్వామిని హరిహరసుతుడని, ధర్మశాస్త్ర, మణికంఠుడని అనేక పేర్లతో పిలుస్తారు. అయ్యప్ప పూజ సాంప్రదాయం అధికంగా దక్షిణ భారతదేశంలో ఉంటుందని తెలిపారు. మనిషి అనే రాక్షసుని చంపి అయ్యప్ప శబరిమలై లో వెలిశారని అన్నారు. కేరళలోని శబరి మలై హిందువుల ప్రధాన యాత్ర సంస్థలలో ఒకటి అని అన్నారు. అయ్యప్ప స్వామి కోరే కోరికలను తీర్చు దేవుడని తెలిపారు. రెండు అర్థాలున్న మూటను భక్తులు దీనిని నెత్తిన పెట్టుకొని మూసుకోపోతుంటారు అని తెలిపారు. ఇరుముడిలో నెయ్యితో నింపిన కొబ్బరికాయ రెండు కొబ్బరికాయలు, మొక్కలు, తమలపాకులు, నాణాలు, పసుపు, గంధం పొడి, విభూతి, పన్నీరు, బియ్యం, అటుకులు, మరమరాలు, బెల్లం, అరటి పండ్లు, కలకాండ, అగరవత్తులు, కర్పూరం, మిరియాలు, (ఓవర్ దగ్గర కోసం) తేనె, వెండి ద్రాక్ష, పువ్వులు పెట్టుకుంటారు. ఈ వస్తువులను ఇరుముడిగా కట్టుకునే ఉత్సవాన్ని, చెట్టునిరా, లేదా పల్లికెట్టు అని అన్నారు. వీటితో ఇరుముడిని కట్టుకొని శబరిమలై అయ్యప్ప యాత్రను కదం తొక్కుతారు అయ్యప్ప స్వాములు అని అన్నారు. అనంతరం స్వాములకు చిత్తూరి మల్లేష్ స్వామి స్వాములకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ ఇరుముడి కార్యక్రమంలో స్వాములు భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికసహాయం అందజేత



**రామన్నపేట, విశాలభారతి:** జగ్గయ్యపేట గ్రామానికి చెందిన నిత్యమాలధరుడు శ్రీశ్రీశ్రీ బాబ్జి గురుస్వామి అకాల మృతి చింతిస్తూ రామన్నపేట మండలానికి చెందిన అయ్యప్ప భక్త బృందం మృతదేహంపై పూలమాల వేసి కన్నీటి నివాళులర్పిస్తూ ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. బాబ్జి గురుస్వామి మృతిని అయ్యప్ప దీక్షాపరులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జీర్ణించుకోలేకపోతున్నారు. దైవ సమానులైన బాబ్జి గురుస్వామి పార్థియాదేహాన్ని చూడడానికి మాల ధారణ లో ఉన్నటువంటి. భక్త బృందం అంత్యక్రియల్లో పాల్గొనలేక పోతున్నామని మనోవేదనతో చింతిస్తున్నారు ప్రతి అయ్యప్ప దీక్షపరుడు బాబ్జి గురు స్వామిని చివరిసారిగా చూడలేని పరిస్థితిలో ఉండి మనోవేదనతో కన్నీటి పర్వతమవుతున్నారు గురు స్వామి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని ఆ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామిని ప్రతి మాలాదారుడు వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం అందజేసిన వారు. వనం భాస్కర్. లవణం ఉపేందర్. వడ్లకొండ లక్ష్మమ్మ నరసింహ. కసిరెడ్డి ఇంద్రారెడ్డి. కొల్లోజు పాండురంగ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

**ధర్పల్లి, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను, వాహనాల యజమానులను ఆదుకొనేల ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని మండల సూర్యచంద్ర ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు ముస్తాఫ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ధర్పల్లి మండల కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్లును ప్రభుత్వమే ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళలో ఆరు గ్యారెంటీలతో ముందుకు రావడం జరిగిందని, అందులో ఒకటి మహిళలకు ఆర్టీసీ బస్సుల లో రవాణా ఉచితం అని, అట్టి నిర్ణయం రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నప్పటికి తీసుకున్న నిర్ణయం మరొకరిపై భారం పడుతుందన్నారు. ఈ పథకం మంచిదే అయినప్పటికీ లక్షలాదిమంది ఆటోకార్మికులు, యజమానులు, రవాణా రంగం మీద ఆధారపడి ఉన్నారన్నారు. ఆటో డ్రైవర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్తప్ప, గంగాకిషన్, మందుల గణేష్, బబాన్న ,శ్రీనివాస్,కనకం రాజేందర్, ఈదుల్ల రమేష్,బిల్ల రాజేందర్, మంచికంటి ప్రశాంత్,నరేష్,లింబద్రి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.




# ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తాం

**సిఐటియు నాయకులు**

**మందమర్రి టౌన్, విశాల భారతి:** కార్మికులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీలను అమలు చేసి చూపిస్తామని సిఐటియు నాయకులు తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా వర్క్ షాప్ లో పిట్ సెక్రటరీ భేతి భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ నాగరాజు గోపాల్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఏఐటియుసి, ఐఎన్టీయూసీలు కలిసి పోటీ చేశారని ఆ పొత్తు ఎందుకు చేదిరిందో కార్మికులకు తెలియజేయాలని, ఇంతవరకు ఐఎన్టీయూసీ బిఆర్ఎస్ ప్రభుత్వ అనుబంధ సంఘం వల్లనే రాజకీయ జోక్యం పెరిగి సంస్థకు నష్టం కలిగిందని, నేడు వారు గెలిస్తే రాజకీయ జోక్యాన్ని లేకుండా చేస్తారా అని ప్రశ్నించారు. కొత్త మున్సిపాలిటీ పరిధి లోని కార్మికులకు హెచ్ఆర్ఏ ఇప్పించడంలో శ్రీరాంపూర్ లో పోరాటాలు చేసిన యూనియన్ గెలిచినా మందమర్రి ఏరియాలో ఇంటికిరాయి ఇవ్వకపోతే అసలు పట్టించుకోలేదని అన్నారు. బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు అయిందాల శ్రీనివాస్, సంకె వెంకటేష్, జడల ప్రవీణ్ వర్క్ షాప్ కార్మికులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులకు శాస్త్రీయ బోధనలు అవసరం





**మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి రాహుల్**

**మంచిర్యాల, విశాల భారతి:** మానవాళి మనుగడకు తోడ్పడే ఆవిష్కరణలు రావాలని అందుకు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించే సైన్స్ ప్రదర్శనలు విరివిగా జరగాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం బెల్లంపల్లిలో జోన్ 1 జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందవిశ్వాసాలను సమాజం దూరం పెట్టినప్పుడే ఉన్నత సమాజం ఏర్పడుతుందన్నారు. ఆడిశగా నేటి విద్యార్థులకు శాస్త్రీయ బోధనలు అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు ఆరు అంశాలలో అంశాల వారీగా ప్రదర్శించిన ప్రదర్శనలను సందర్శించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అంశాల వారీగా ప్రతి అంశంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కోఆర్డినేటర్స్ సంగనభట్ల శ్రీనివాస్, పోలోజు బాలరాజు స్థానిక ప్రిన్సిపల్ సందారాజ స్వరూప, వైస్ ప్రిన్సిపల్ పబ్బతిరెడ్డి స్వరూప రాణి, రీజియన్ లోని పలు గురుకులాల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రథమ స్థానంతో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు:**

కె.అక్షిత్, డి.మనీష్ (కాసిపేట బాయ్స్), ఐ. తేజ, ఎం. సాయిరాం (సిఓఈ బాయ్స్ బెల్లంపల్లి) ఎం.అక్షయ,టి. గంగ భవాని (నిజామాబాద్ గర్ల్స్) జె.అంజన్న, జి.డేవిడ్ (ఏటూరునాగారం బాయ్స్, ములుగు) ఏ.శివచరణ్,ఎం.సాయి కిరణ్ (ఆర్మూర్ బాయ్స్ నిజామాబాద్) వి.సుందర్, బి.శివచరణ్ (మంచిర్యాల బాయ్స్)

**ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు:**

బి.నితీష, జి.లక్షిత (జగిత్యాల గర్ల్స్) పి.అరుణ్ కుమార్, డి.అభిరామ్ (మంచిర్యాల బాయ్స్) జి.రాజేశ్వర్,కె. కృష్ణ (సిర్పూర్టి బాయ్స్),జె. మౌనిక, ఎస్.శిరీష( కాగజ్ నగర్ గర్ల్స్) ఏ.వినయ్, డి.హరీష్(సిఓఈ బాయ్స్,బెల్లంపల్లి) సిహెచ్.సంజన,బి.అంజలి(నవిపేట గర్ల్స్,నిజామాబద్)

**తృతీయ బహుమతి సాధించిన విద్యార్థులు:**

కె.హాసిని,బి.నిహారిక (లక్షట్ పేట గర్ల్స్) జి.విశాల్,ఎం. రుత్విక్ (కోటపల్లి)డి. శ్రీజ, బి.హాసిని( బెల్లంపల్లి గర్ల్స్) బి.అమూల్య, కె.శ్రీనిధి (ధర్మారం గర్ల్స్ నిజామాబాద్) పి.భూమిక,వైష్ణవి( లక్షట్ పేట గర్ల్స్) డి.అమూల్య,డి. అక్షిత (లెఫ్ట్ పోచంపాడు,నిర్మల్)



# సింగరేణి సంస్థ మనుగడకు ఏఐటీయూసీని గెలిపించండి

**ఏఐటీయూసీ నాయకులు**

**మందమర్రి టౌన్, విశాల భారతి:** రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో నిరంతరం కార్మికుల హక్కుల రక్షణ, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం పోరాడే ఏఐటీయూసీ యూనియన్ ని భారీ మెజారిటీ తో గెలిపించాలని కార్మికులను ఏఐటీయూసీ నాయకులు కోరారు. సింగరేణిలో బీఆర్ఎస్ అనుబంధ యూనియన్ టీబీజీకేఎస్ మితిమీరిన రాజకీయ జోక్యం వలన సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని అన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కేకే5 గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి బ్రాంచి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ద్వార సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు కార్మిక సమస్యలు ఏ మాత్రం పట్టించుకోని కొన్ని యూనియన్లు, కార్మికులకు మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్న ఏఐటీయూసీ యూనియన్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఎస్సి, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మందమర్రి ఏరియా నాయకులు బానోత్ నాగేశ్వర్ నాయక్, బ్రాంచి ఆర్గనైజింగ్ సెక్రటరీ గాండ్ల సంపత్ ఆధ్వర్యంలో 40 మంది ఉద్యోగులు ఏఐటీయూసీ విధానాలు నచ్చి చేరిన వారికి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచి సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బీమానాధుని సుదర్శన్, బ్రాంచి అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, బ్రాంచి నాయకులు వెల్ది ప్రభాకర్, జెట్టి మల్లయ్య, కేకే5 గని ఫిట్ సెక్రటరీ దేవసాని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# అంగడి బజార్లో సమస్యలను పరిష్కరిస్తా

**ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ పట్టణంలో రైతు బజార్ ( అంగడి బజార్) ను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తో కలిసి సందర్శించారు. రైతు బజార్లోని మరుగుదొడ్లను, అస్తవ్యస్తంగా మారిన మడిగేలను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే అంగడి బజార్ రూపురేఖలను మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కార్యకర్తల కృషితో విజయం

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఒరవడితో కలిసికట్టుగా జిల్లాభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన

**అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి**

**షాబాద్, విశాల భారతి :** షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ గ్రామంలో మల్లన్న గుట్టపై అన్నదాన సత్రానికి ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దానితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. మారుమూల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి పూజించడం అభినందనీయం అన్నారు. అన్నదాన సత్రానికి శంకుస్థాపన చేసిన ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య ని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రంగం శ్రీనివాస్ గ్రామస్తులు యాదయ్య, మల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నారాయణ, అనువర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మంత్రి సీతక్కను కలిసిన మధుసూదన్ రెడ్డి

**షాబాద్, విశాల భారతి:** మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ధనసరి సీతక్కను బుధవారం హైదరాబాదులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తెలుగు ఎల్గంటి మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వికారాబాద్ ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ఆరోగ్యశ్రీ పథకం పేదలందరికీ వరం లాంటిదని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ త్వరలోనే అమలవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఆలూరులో గంజాయి పట్టివేత



**ఆర్మూర్, విశాల భారతి:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం లోని ఆలూరు మండలంలోని ఆలూర్ దేగం రోడ్డు మార్గంలో ఆర్మూర్ ఎక్సైజ్ బృందం బుధవారం గస్తీ నిర్వహిస్తుండగా ఆలూరు పల్లె ప్రకృతి వనం సమీపంలో రాజేష్ ముఖ్య అను వ్యక్తి గంజాయి ప్యాకెట్స్ అమ్ముతూ పట్టుబడినట్లు ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ స్టీవెన్సన్ తెలిపారు. సమాచారం మేరకు అక్కడికి వెళ్లి ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన రాజేష్ ముఖ్య అనే వ్యక్తిని పట్టుకొని తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి ప్యాకెట్లు లభించాయన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్ కు తరలించి అతని వద్ద ఉన్నటువంటి 220 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. ఈ తనిఖీలో ఆర్మూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ స్టీవెన్సన్,సబ్ ఇన్స్పెక్టర్ లు ఏ. గంగాధర్, ప్రమోద్ చైతన్య, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ గౌడ్, కానిస్టేబుల్స్ దేవిదాస్ , సాయిబాబా గౌడ్, గొల్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



# విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ బాలికల పాఠశాలను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బుధవారం సందర్శించారు. విద్యార్థినిలతో సరదాగా కాసేపు ముచ్చటించి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్ల సౌకర్యాలను మెరుగుగా కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, కలిగోట్ గంగాధర్, మందుల బాలు తదితరులు పాల్గొన్నారు.





# వీర్లపల్లి శంకర్ మీ అందరివాడు

- ప్రజాసేవకే అంకితమై పనిచేస్తా.
- కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకుంటా.
- గ్రామాల్లో "సరైనోల్లను" నాయకులుగా ఎన్నుకోండి.
- వేములనర్వ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్.

**షాద్ నగర్,విశాలభారతి:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పథకాలు కొందరికే గిరిగీసి లబ్ధిచేకూరేలా పాలన సాగించారని అందరి పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని ఇకపై అలాంటి పరిపాలన రాష్ట్రంలో సాగదని గ్రామంలో నిజమైన అర్హులు ఎవరైనా ఏ పార్టీ వారైనా సరే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేవిధంగా మాత్రమే గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని,వీర్లపల్లి శంకర్ మీ "అందరివాడు" అని కొందరికే పరిమితం అనేలా పనిచేయడని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో యాచవరం శ్రీకాంత్ రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన తండ్రి మోహన్ రెడ్డి నిర్మించిన నూతన బస్ షెల్టర్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది,ఆశాలు,మధ్యాహ్న భోజన వర్కర్స్ ఇలా అందరూ ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో ఎవ్వరూ సుఖంగా లేరన్నారు.బిల్లులు రాక సర్పంచులు,కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నవైనం మనం చూసామని తెలంగాణ ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఇక ఒక్కొక్కటిగా మన కష్టాలు తీరనున్నాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలను,నాయకులను అన్ని వర్గాలను విభజించి పాలించారని నిజమైన అర్హులకు కూడా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వలేదని,నేను మీ నమ్మకాన్ని వమ్ముచేయనని,అవినీతి,అక్రమాలకు తావులేని పాలన సాగిస్తానని అన్నాడు.అందరికి అందుబాటులో ఉంటానని నన్ను కలవాలంటే మధ్యల చిన్నబాబు,పెద్దబాబు ఇలా ఏ బాబు ఉండడని ఎప్పుడైనా నిరభ్యంతరంగా కలవచ్చని ఆయన అన్నారు. అదేవిధంగా తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని, గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు తెలిపారు.

**గ్రామాల్లో "సరైనోల్లను" నాయకులుగా ఎన్నుకోండి.**

రేపు గ్రామాలలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థులందరు కూర్చొని మాట్లాడుకొని ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేసే సరైన నాయకున్ని ఎన్నుకోవాలని అప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు.అంతకుముందు గ్రామానికి తొలిసారిగా ఎమ్మెల్యే హోదాలో వచ్చిన శంకర్ ను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మంజుల మల్లేష్, ఇప్పలపల్లి ఎంపిటిసి మంజులరాజశేఖర్, నాయకులు పల్లె ఆనంద్,సర్పంచ్ అంజయ్య, సురేష్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,రూప్లా నాయక్, మనోహర్ గౌడ్,ఎమ్మార్పియస్ నాయకుడు గ్యార సురేష్, రవీందర్ గౌడ్, హన్మంత్ రెడ్డి, తైద పర్వతాలు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుక ఏర్పాట్లపై సమీక్షా

**మందమర్రి టౌన్, విశాల భారతి:** సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ ఆదేశించారు. బుధవారం జీఎం కార్యాలయంలో అన్ని గనుల శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జీఎం మాట్లాడుతూ మందమర్రి ఏరియా లోని సింగరేణి పాఠశాల మైదానంలో డిసెంబర్ 23 న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలో అన్ని రకాల తిను బండారాల స్టాల్స్, కంపెనీకి సంబంధించిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. డిసెంబర్ 18 మధ్యాహ్నం 2 గంటలకు మందమర్రిలో సీఈఆర్ క్లబ్ లో మహిళలకు త్రోబాల్, బాంబే బ్లాస్ట్, బాల్ ఇన్ బాస్కెట్ పోటీలు నిర్వహిస్తారని, డిసెంబర్ 19న సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు దీపాలంకరణ నిర్వహించబడునని, ఈ పోటీలలో పాల్గొనె మహిళలకు దీపాలలో నూనె సింగరేణి యాజమాన్యం ఉచితంగా అందజేస్తారని అన్నారు. దీపాలంకరణ పోటీలలో పాల్గొనే వారు 7013359316, 8688150431, ఉత్తమ గృహాల ఎంపికలో పాల్గొనేవారు 99899945472, 9491145233 చరవానిలో సంప్రదించాలని సూచించారు. తినుబండారాల ప్రత్యేకమైన స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునేవారు మందమరి ఏరియా జిఎం కార్యలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ లో డిసెంబర్ 20 లోగా వారి పేర్లను నమోదు చేసుకోగలరని పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.





# 'డీసీసీబీ చైర్మన్‌గా కొత్తకుర్మ సత్తయ్య'

**రంగారెడ్డి ప్రతినిధి,విశాలభారతి:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ గా కొత్తకుర్మ సత్తయ్య నియమితులయ్యారు. సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్లు సత్తయ్యను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాంపల్లిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సత్తయ్య బాధ్యతలు స్వీకరించారు. సత్తయ్యకు బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి తొలిసారి డీసీసీబీ చైర్మన్ పదవి రావడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ జిల్లాలో రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తనకు చైర్మన్ పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ మంత్రులు మహేందర్‌రెడ్డి, సబిత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కాగా, తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్ రెడ్డి గెలవడంతో డీసీసీబీ చైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో బ్యాంక్ వైస్ చైర్మన్‌గా ఉన్న సత్తయ్యకు డైరెక్టర్లు సంపూర్ణ మద్దతు తెలిపి ఎన్నుకున్నారు.



# పాఠశాల విద్యావాలంటీర్ కు ఆర్థికసాయం

- 25 వేల నగదు అందజేత
- బోధనాసమస్యల పరిష్కారంలో రాజేష్ పటేల్

**కొందుర్గు,విశాలభారతి:** మండల కేంద్రములోని దళితవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా నియమించిన విద్యా వాలంటీర్ కు బుధవారం రూ.25000 నగదును మండల వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయుల కొరత వల్ల పాఠశాలలో భోదనాపరమైన సమస్యలను అధిగమించి నాణ్యమైనవిద్య అందించడం కోసం తాత్కాలికంగా విద్యా వాలంటీర్ ను నియమించి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా అందరికీ విద్య అందించడానికి కావలసిన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లపుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్ సాగర్,ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు

# రాజీ మార్గమే రాజ మార్గం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రంగారెడ్డి జిల్లా**



**చేవెళ్ల, విశాల భారతి:** మండల పరిధిలోని జాతీయ లోక్ అదాలత్ ని అందరు సద్వినియోగం చేసుకోవాలి అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు డిసెంబర్ 30న రంగారెడ్డి జిల్లా లోని అన్ని కోర్ట్ లలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఇదివరకు కోర్ట్ ముందుకు రాని కేసులు కానీ కోర్ట్ లందు పెండింగ్ లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్ అని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఇట్టి అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని.. రాజీ మార్గమే రాజ మార్గం అని తెలిపారు.



# మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం..

**మేయర్ జక్కా వెంకట్ రెడ్డి.**

**మేడిపల్లి,విశాలభారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఇస్లావత్ నమ్య ఆధ్వర్యంలో సానిటేషన్ అధికారుల, బిల్ కలెక్టర్,వార్డ్ ఆఫీసర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దోమల నివారణలో భాగంగా ఇప్పటికే నగర పరిధిలో ప్రతి డివిజన్ లో ఎలక్ట్రిక్ స్ప్రే మిషన్ ద్వారా ప్రతి ఇంటికి చేపట్టిన దోమల మందు పిచికారి పురోగతి అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రజలు కూడా ఈ ప్రక్రియను స్వాగతిస్తుండటంతో సాధ్యమైనంత మేర త్వరిత గతిన నగరంలోని ప్రతి ఇంటి లోపల దోమల మందు పిచికారి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల్లోని గుర్రపుడెక్క వల్ల దోమల సమస్య రోజు రోజుకి పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ సహాయంతో కెమికల్ లిక్విడ్‌తో చెరువులో దోమల నివారణకు యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆస్తిపన్నుతో పాటు ట్రేడ్‌లైసెన్సుల ఫీజులు కూడా వసూలు చేయడం, ట్రేడ్ లైసెన్సు రెన్యూవల్ తో పాటు అనుమతులు పొందని వ్యాపారుల కు లైసెన్సులు జారీచేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జ్యోతి , RO శ్రీనివాస్ రెడ్డి,AE బిక్షపతి,JAO సుమలత,బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా'



**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు 19వ వార్డు కౌన్సిలర్ నారని కవితాశేఖర్‌గౌడ్ ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు తెలిపారు. బుధవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవితాశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ తన వార్డు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. మల్‌రెడ్డి బ్రదర్స్ నాయకత్వంలోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి సహకారంతో ఇప్పటికే తమ వార్డులో అనేక అభివృద్ధి చేపట్టామన్నారు. వార్డు పరిధిలో నూతన కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి కుంటుపడకూడదన్న ఉద్దేశంతో పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలిపారు. ఇకపై మల్‌రెడ్డి సోదరుల నాయకత్వంలో పనిచేస్తామన్నారు. వారి నిర్ణయమే తమకు శిరోధార్యమని, వారి ఆదేశాల మేరకు ఇకపై నడుచుకుంటామన్నారు. కాగా, మూడు నెలల క్రితమే కవితాశేఖర్‌గౌడ్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కొన్నాళ్లకే గులాబీ పార్టీని వీడి తిరిగి సొంతగూటికి చేరారు కవితాశేఖర్‌గౌడ్.



# 'అక్రమ నిర్మాణాల కూల్చివేత'

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో 212 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో స్మశానవాటికకు కేటాయించిన స్థలంలో కొందరు కబ్జాదారులు మూడు ఇళ్లు నిర్మించారు. దాదాపు రెండు నెలల నుంచి ఎన్నికల హడావుడిలో ఉన్న అధికారుల కళ్లు గప్పి భూకబ్జాదారులు రెచ్చిపోయి ఇళ్లు కట్టుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు కబ్జా చేసిన ఇళ్లను బుధవారం నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ కమ్మగూడ సుందరయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల ప్రజలకు స్మశానవాటిక కోసం కేటాయించిన భూమిని కబ్జా చేయడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు చట్టపరంగా వ్యవహరిస్తే భూములు కబ్జా అయ్యే అవకాశముండదన్నారు. ఇప్పటికైనా స్మశానవాటిక స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి కాపాడాలని సూచించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నిధులు మంజూరు చేయాలన్నారు. స్మశానవాటికను పూర్తి స్థాయిలో వినియోగం తెచ్చేందుకు కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని యాదయ్య తెలిపారు.



# మల్లారెడ్డి ఎన్నికల హామీలు నెరవేరేది ఎప్పుడు

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజల డిమాండ్
- ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది.
- పిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి.





**మేడిపల్లి,విశాల భారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరేది ఎప్పుడు అవి నిజంగా నెరవేరుతాయ లేదా అనే సందేహం ప్రజలకు కలుగుతుంది. ఎన్నికల ప్రచారంలో చామకూర మల్లారెడ్డి గెలిచేందుకు శతవిధాల ప్రయత్నించాడు. కార్పొరేషన్ లోని అన్ని డివిజన్ల లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని,కమ్యూనిటీ హాళ్లు కట్టిస్తామని,కుల సంఘాల భవనాలు కట్టిస్తామని,సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని, ఇలా అనేక రకాలుగా ప్రజలకు హామీలు ఇచ్చి,ఇప్పుడు హామీలను గాలికి వదిలేశారు. కొన్ని కాలనీలలో రాత్రికి రాత్రే సీసీ కెమెరాలు బిగించి వాటికి ఎలాంటి కనెక్షన్లు ఇవ్వకుండా మామ అనిపించారు, ఓట్లు దండుకోవడం కోసం మసిపూసి మారేడు కాయ చేసిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తీరుపట్ల కార్పొరేషన్ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని, మల్లారెడ్డి తీరుపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మండిపడ్డారు.గత నాలుగేళ్లలో గుర్తుకురాని అభివృద్ధి,కాలనీ అసోసియేషన్ల సంక్షేమం ఎన్నికల ముందు మాత్రమే గుర్తుకు రావడం శోచనీయమని, ఇప్పటికైనా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రజల్లోకి వచ్చి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలదీస్తుందని అన్నారు.



# నానీల సుగంధం కవిత్వ ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** నానీలు రాయడంలో చాలా మంది సీనియర్ కవులకంటే కూడా శక్తివంతంగా ఆదినారాయణ వర్ణించాడని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షులు ఆచార్య ఎన్. గోపి గారు వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ అండ్ సాహితీ జిగీష సాహితీ సంస్కృతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డా. గిన్నారపు ఆదినారాయణ రచించిన నానీల సుగంధం కవిత్వ సంపుటిని ఆవిష్కరణ, అంకితోత్సవ సభ రవీంద్ర భారతి మినీ సమావేశ మందిరంలో జరిగింది. డాక్టర్ ఎస్. రఘు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పుస్తకాన్ని తన గురువు హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య ధార్ల వెంకటేశ్వరరావుకి అంకితం ఇచ్చారు. ఈ సమావేశంలో ఆచార్య ఎన్ గోపి ముఖ్య అతిథిగా పాల్గొని నానీల సుగంధం కవిత్వాన్నీ, ఆ ప్రక్రియను సోదాహరణంగా వివరించారు. తాను రాసిన కొన్ని నానీలతో పాటు ఆదినారాయణ నానీలను ఆయన విశ్లేషించారు. ఇంతవరకు వచ్చిన మొదటి 50 పుస్తకాల్లో ఆదినారాయణ పుస్తకం ఒకటిగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు పుస్తకాన్ని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు ఎం దేవేంద్ర సమీక్షించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎస్ చంద్రయ్య పుస్తకంపై మాట్లాడారు. ఈ సమావేశంలో గ్రంథకర్త డాక్టర్ ఆదినారాయణ, కృతి స్వీకర్త ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తనకు అంకితం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా సాహితి జిగీష కార్యదర్శి, పూర్వ ప్రిన్సిపాల్ డా..పి.లలితవాణి, సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య పిల్లలమర్రి రాములు తదితరులు పాల్గొన్నారు



# గుంటూరు కారం నుంచి 'ఓ మై బేబీ' విడుదల

సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'అతడు', 'ఖలేజా' వంటి కల్ట్ క్లాసిక్ సినిమాలు వచ్చాయి. ఇప్పుడు ఈ బ్లాక్ బస్టర్ కాంబినేషన్, ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక & హాసిని క్రియేషన్స్ తో చేతులు కలిపింది. తమ సంస్థలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'గుంటూరు కారం' కోసం అగ్ర నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చిన్నబాబు) ఈ కలయికను తీసుకువచ్చారు. సూపర్ స్టార్ మహేష్ అభిమానులు ఈ చిత్రాన్ని థియేటర్లలో చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం యొక్క మొదటి టీజర్ వైరల్‌గా మారింది మరియు మహేష్ బాబు యొక్క కొత్త మాస్ లుక్‌ను అభిమానులు ఎంతగానో ఇష్టపడ్డారు. నవంబర్ 11న చిత్ర బృందం మొదటి గీతం "ధమ్ మసాలా"ని విడుదల చేయగా, అది తెలుగు ఆల్బమ్‌లలో టాప్ చార్ట్‌బస్టర్‌లలో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు మేకర్స్ మెలోడియస్ సౌండ్‌ట్రాక్ "ఓ మై బేబీ"ని రెండవ గీతంగా విడుదల చేశారు. ఎస్. థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. ఆయన "ధమ్ మసాలా" పాటకు వచ్చిన స్పందనతో చాలా సంతోషంగా ఉన్నారు. అలాగే ఈ మెలోడీ గీతానికి కూడా అద్భుతమైన స్పందన లభిస్తుందని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. త్రివిక్రమ్‌మహేష్ బాబు, త్రివిక్రమ్‌థమన్ కలయికల్లో పలు చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లు వచ్చాయి. ఇప్పుడు 'గుంటూరు కారం' కూడా మరో భారీ చార్ట్ బస్టర్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలను నిజం చేస్తూ ''ధమ్ మసాలా'' బాటలోనే "ఓ మై బేబీ" పాట కూడా భారీ చార్ట్‌బస్టర్‌గా మారనుంది. ఈ పాట శీతాకాలపు ఉదయం ఆనందకరమైన మెలోడీని వింటూ పొగలు కక్కే కాఫీ తాగుతున్న అనుభూతిని కలిగిస్తుందని బృందం పేర్కొంది. గుంటూరు కారం చిత్రం సంక్రాంతి కానుకగా 2024, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. మరిన్ని వివరాలను చిత్ర బృందం త్వరలో ప్రకటిస్తుంది.

# తమన్నా లో ఛేంజెస్



మిల్కీబ్యూటీ తమన్నా కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. పెళ్లి చేసుకోకుండానే సొగసరి సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టేసి తగ్గేదేలే అంటుంది. ఐటం పాటలతో..గెస్ట్ రోల్స్ తో అదరగొడుతుంది. ఏదైనా సినిమా నే కాదా? అందులో కనిపించనా లేదా? అన్న కోణంలో తమన్నా సినిమాలు చేసుకుంటూ వెళ్లిపోతుంది. ఈ క్రమంలో కెరీర్ లో ఎక్కడా గ్యాప్ లు కనిపించలేదు. ఇంకా చెప్పాలంటే మునుపటి కంటే ఇంకా బిజీ అయిందనిపిస్తుంది. హీరోయిన్ గా రాణించినంత కాలం కేవలం ఆతరహ పాత్రల్లోనే కనిపించింది. కానీ ఇప్పుడన్నీ రకాల పాత్రల్ని కలిపి చేసేస్తోంది. హీరోయిన్ ఛాన్స్ వస్తే హీరోయిన్ అయిపోతుంది. ఐటం గాళ్ల్ ఛాన్స్ వస్తే నర్తకిగా మారిపోతుంది. ఆ రెండు గాక గెస్ట్ రోల్స్ వచ్చినా నాకేం అభ్యంతరం లేదంటూ దూసుకుపోతుంది. ఇలా వృత్తి పరంగా తమన్నా స్పీడ్ ఏ మాత్రం తగ్గలేదు. అలాగే వ్యక్తిగత జీవితంలో ప్రేమ పాఠాల్లోనూ అంతే బిజీగా ఉంది. అలాగని ప్రొఫెషనల్ కెరీర్ ని అశ్రద్ధ చేయలేదు. రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతోంది. అయితే మిల్కీబ్యూటీ రూపంలో మాత్రం కొన్ని రకాల మార్పులు కొట్టొచ్చాయి. రూప లావణ్యంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. తాజాగా అమ్మడు మరో కొత్త ఫోటోని షేర్ చేసింది. అందులో తమన్నా మెరుపులు ఏమాత్రం తగ్గలేదు. కానీ తమన్నాని తదేకంగా పరిశీలిస్తే మాత్రం బ్యూటీలో మార్పులు కనిపిస్తున్నాయి. ఇక తమన్నా భంగిమ మాత్రం వావ్ అనిపిస్తుంది. అమ్మడు ముస్తాబైన విధానం.. పెద్దాలకు అద్దిన ఎర్రటి లిప్ స్టిక్.. యాక్సరసీస్ ప్రతీది తమన్నాని మరింత అందంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. మిల్కీ అందానికి ఫ్యాన్స్ అంతా ఫిదా అవుతున్నారు.



# సలార్ సీజ్ ఫైర్ నుంచి లిరికల్ సాంగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్'. అన్‌కాంప్రమైజ్డ్ బడ్జెట్‌తో అందరూ ఆశ్చర్యపోయే ప్రొడక్షన్ వేల్యూస్‌తో సినిమాలను నిర్మిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. మోస్ట్ అవెయిటెడ్ మూవీగా అనౌన్స్‌మెంట్ రోజు నుంచే ఎప్పుడెప్పుడు సినిమా వస్తుందా అనేంత రేంజ్‌లో ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచిన ఈ సినిమా డిసెంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. రీసెంట్‌గా విడుదలైన 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్' ట్రైలర్ సోషల్ మీడియాను షేక్ చేస్తూ సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. దీంతో సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్నంటింది. ఇప్పుడు దీన్ని మరో మెట్టు పెంచేలా ఈ చిత్రం నుంచి 'సూరీడే..' అనే లిరికల్ సాంగ్‌ను బుధవారం విడుదల చేశారు. గూజ్ బమ్స్ తెప్పించే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న సలార్ సీజ్ ఫైర్‌లో సలార్ మ్యూజికల్ వరల్డ్‌లోకి అందరినీ తీసుకెళ్లారు. అందులో భాగంగా 'సూరీడే..' పాటను తొలి పాటగా విడుదల చేయటంపై ఫ్యాన్స్, ప్రేక్షకులు హ్యాపీగా ఫీల్ అవుతున్నాయి. సలార్ సీజ్ ఫైర్ కేవలం యాక్షన్ సినిమాయే కాదు..అంతకు మించి ఎమోషనల్ కంటెంట్ ఉంటుందని ఆడియెన్స్‌కి క్లియర్‌గా తెలుస్తోంది. సలార్ సీజ్ ఫైర్ సెన్సార్ పూర్తి చేసుకుని ఏ సర్టిఫికేట్‌ను పొందింది. 2 గంటల 55 నిమిషాల వ్యవధితో ప్రేక్షకులను అలరించనుంది.

# రవితేజ, హరీష్ శంకర్,పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబో అనౌన్స్ మెంట్



మ్యాజికల్ కాంబో మాస్ మహారాజా రవితేజ, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మించనున్న ఎంటర్‌టైనర్ కోసం మూడోసారి చేతులు కలిపారు. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సహ నిర్మాత. హరీష్ శంకర్‌ని దర్శకుడిగా పరిచయం చేసింది రవితేజ అయితే, రవితేజకు మాస్ మహారాజా ట్యాగ్ ఇచ్చింది హరీష్. మరోవైపు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో రవితేజ నటించిన 'ధమాకా' చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. దీంతో ఈ మాస్, క్రేజీ కాంబినేషన్‌లో చిత్రం ధమకేధార్ ఎంటర్‌టైనర్‌ను అందించబోతోంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమాని ఈరోజు అధికారికంగా అనౌన్స్ చేశారు. హరీష్ శంకర్ తన హీరోలను మ్యాసియస్ట్ అవతార్ లో చూపించడంలో దిట్ట. రవితేజతో హరీష్ చేసిన గత చిత్రం 'మిరపకాయ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ కాంబినేషన్‌లో సినిమా కోసం అభిమానులు, మాసెస్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా ఎలాంటి మాస్ ఎలిమెంట్‌స్‌ను కలిగి ఉంటుందో తెలియజేయడానికి ..'ఈసారి మాస్ రీయూనియన్ స్పైసీగా ఉంటుంది' అని మేకర్స్ అనౌన్స్ చేశారు.



# జాన్వీ కపూర్ చెల్లెలు డెబ్యూ ఇదే!

అతిలోక సుందరి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ డెబ్యూ ఫిక్సైందా? 2024 లో అమ్మడు హీరోయిన్ గా పరిచయం కాబోతుందా? అంటే అవుననే తెలుస్తోంది. ఇటీవలే `ది అర్చిస్` తో ఖుషీ కపూర్ లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడి రోల్ చిన్నదే. తెరపై కనిపించినంత సేపు నటిగా మంచి మార్కులు పడ్డాయి. కానీ తనతో పాటు ఇంకా బాలీవుడ్ నుంచి చాలా మంది స్టార్ కిడ్స్ ఉండటంతో ఖుషీ కది పర్ఫెక్ట్ లాంచింగ్ కాలేకపోయింది. దీంతో ఖుషీ కపూర్ హీరోయిన్ గా కనిపించేది ఎప్పుడు అన్న అంశంగా ఆసక్తికరంగా మారింది. తాజాగా ఖుషీ అందుకు ఎక్కువ సమయం తీసుకోలేదని తెలిపోయింది. `ది అర్చిస్` తో లాంచ్ అవుతూనే హీరోయిన్ గా ప్రాజెక్ట్ ని ఫైనల్ చేసుకుంది. అక్క జాన్వీ కపూర్ తరహాలోనే చెల్లెలు సైతం ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్ లోనే హీరోయిన్ గా పరిచయం కాబోతుంది. ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించడానికి కరణ్ జోహార్ ముందుకొచ్చారు. కృతజ్ఞత ఇదే సినిమాతో బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ కూడా హీరోగా పరిచయం అవుతున్నాడు. ఆ యంగ్ హీరోకి జోడీగానే ఖుషీ కపూర్ ని కరణ్ ఫైనల్ చేసారు. శౌనా గౌతమ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదొక రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమైంది. వచ్చే ఏడాది చిత్రీకరణ ప్రారంభించాలని నిర్మాణ సంస్థ ప్లాన్ చేస్తోంది. అందుకు తగ్గ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తానికి కరణ్ ఈ సారి ఇద్దరు వారసుల్ని ఈసారి వెండి తెరకు పరిచయడం విశేషంగానే భావించాలి. సైఫ్ అలీఖాన్ బాలీవుడ్ లో స్టార్ హీరోగా కొనసాగుతున్నారు. ఇప్పడాయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని ఇబ్రహీం అలీఖాన్ మ్యాకప్ వేసుకుంటున్నాడు. శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ ఇప్పటికే హీరోయిన్ గా రాణిస్తోంది. ఇప్పుడు చెల్లెలు కూడా మ్యాకప్ వేసుకోవడంతో శ్రీదేవి కోరిక కూడా నెరవేరు తున్నట్లే. తండ్రిగా బోనీకపూర్ కుమార్తెల బాధ్యతల్ని అన్ని రకాలు గా పరిపూర్ణం చేస్తున్నారు.

# #మాయలో' క్లీన్ ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్

యంగ్ ట్యాలెంటెడ్ హీరో నరేష్‌అగస్త్య, భావన, జ్ఞానేశ్వరి కాండ్రేగుల ప్రధాన పాత్రలలో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ '#మాయలో'. మేఘా మిత్ర పేర్వార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేం పిక్చర్స్ బ్యానర్ పై షాలినినంబు, రాధా కృష్ణ నంబు నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పాటలు, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం డిసెంబర్ 15 విడుదలౌతున్న నేపధ్యంలో చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. ప్రెస్ మీట్ లో హీరో నరేష్‌అగస్త్య మాట్లాడుతూ.. #మాయలో.. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. ఇందులో ప్రతి సన్నివేశం హాయిగా నవ్వుకునేలా వుంటుంది. మేఘా రాసిన ప్రతి సన్నివేశం వండర్ ఫుల్ గా వుంటుంది. భావన, జ్ఞానేశ్వరి అద్భుతంగా నటించారు. డెనిస్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. డిసెంబర్ 15న సినిమా విడుదౌతుంది. తప్పకుండా మీరంతా ఆదరిస్తారని నమ్ముతున్నాను'' అన్నారు. దర్శకుడు మేఘా మిత్ర పేర్వార్ మాట్లాడుతూ.. చక్కని వినోదం, మనసుని హత్తుకునే భావోద్వేగాలు, మంచి పెర్ఫార్మెన్స్, ఆకట్టుకునే మాటలు వుండే కథ ఇది. మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాత షాలిని నంబు మాట్లాడుతూ.. సోలో నిర్మాతగా ఇది నా మొదటి చిత్రం. మా బ్రదర్ తో కలసి సినిమా నిర్మించాను. చాలా ప్రేమతో ఈ సినిమా చేశాం. చాలా మంచి టీంతో వర్క్ చేశాం. అందరూ చక్కని ప్రతిభ కనపరిచారు. ఇది చాలా క్లీన్ ఫిలిం. మంచి ఎంటర్ టైనర్. తప్పకుండా మీ అందరికీ న్నచ్చుతుంది'' అన్నారు.




# ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది

: విరాజ్ అశ్విన్



బేబి చిత్రంతో యువ ప్రేక్షకులను అలరించిన కథానాయకుడు విరాజ్ అశ్విన్. ఆ చిత్రంతో లవర్‌బాయ్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న ఈ యువ కథానాయకుడు హీరోగా నటించిన తాజా చిత్రం జోరుగా హుషారుగా. పూజిత పొన్నాడ కథానాయిక. అనుప్రసాద్ దర్శకుడు. నిరీష్ తిరువిధుల ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో విరాజ్ అశ్విన్‌తో జరిపిన ఇంటర్వ్యూ ఇది. బేబి చిత్రం హిట్ అవుతుందని అనుకున్నాం. కానీ ప్రేక్షకులు ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ ఇస్తారని అనుకోలేదు. బేబి తరువాత చాలా ఆఫర్లు వస్తున్నాయి. కానీ నేను బాధ్యతగా, చాలా సెలెక్టివ్‌గా వెళుతున్నాను. ఒక హిట్ సినిమా తరువాత వస్తున్న సినిమాకు ఎంత పెద్ద హెల్ప్ అవుతుందనడానికి జోరుగా హుషారుగా మంచి ఉదాహరణ. బేబి తరువాత వస్తున్న ఈ సినిమాపై అందరిలోనూ మంచి పాజిటివ్ వైబ్స్ వున్నాయి. నాకైతే వ్యక్తిగతంగా కాస్త ప్రెజర్‌గా వున్న సినిమా తప్పకుండా సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందన్న నమ్మకం వుంది. బేబీ తరువాత కెరీర్ ముందుతో పొల్చితే హీరోగా చాలా ఆఫర్లు వస్తున్నాయి. బేబీ తరువాత దాదాపు అన్ని జానర్‌ల కథలు విన్నాను. అయితే బేబి ప్రభావంతో ఎక్కువగా లవర్‌బాయ్ పాత్రలే వస్తున్నాయి. అయితే నేను మాత్రం కథ, నా పాత్ర నచ్చితే సినిమా ఒప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ చిత్రంలో ముఖ్యంగా ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది. ఒక మిడిల్ క్లాస్ ఫాదర్ తన కొడుకును సక్సెస్‌ఫుల్ చేయడానికి ఎలాంటి త్యాగాలు చేశాడు? ఫ్యామిలీ కోసం కొడుకు ఏం చేశాడు? అనేది ఎంతో ఎమోషన్‌గా వుంటుంది. ఇది చాలా కాకతాళీయంగా, సర్‌ప్రైజింగ్ వుంది. మన లైఫ్‌లో బిగ్గెస్ట్ ఎమోషన్ ఫాదర్ ఎమోషన్. నిజంగా చాలా ఆనందంగా వుంది. తప్పకుండా మా సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం వుంది. హాయ్ నాన్న చిత్ర దర్శకత్వం టీమ్ అంతా నా ఫ్రెండ్స్ కావడంతో ఈ సినిమాలో నటించాను. ఆ చిత్రంలో నాని విరాజ్ పాత్రలో కనిపించడం నిజంగా కో ఇన్‌సిండెంట్ అంతే. ఆ సినిమా షూటింగ్ సమయంలో విరాజ్ అంటే నేను పలకడం, హాయ్ నాన్న ప్రీరిలీజ్ వేడుకలో విరాజ్ అనగానే అందరూ నేను అనుకోవడం, ఇలా చాలా ఫన్నీగా, సంతోషంగా అనిపించింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.